ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఆగస్టు 30, 2009

ఉద్వేగాల చెలగాటం

హ్యాపీ బర్త్‌డే

(2009 ఆగస్టు 30 నుంచి 2009 సెప్టెంబర్ 5 వరకు)

ఎం. సాయితేజ యాదవ్
1సం॥, ఆగస్టు-31
పద్మ-స్వామియాదవ్
బోల్లోనిపల్లి-కరీంనగర్

పి. అశోక్
10సం॥, ఆగస్టు-28
పేరమ్మ-సుబ్బారావు
చందవరం-గుంటూరు

కె. వైష్ణవి
4సం॥, ఆగస్టు-2005
పల్లవి-కృష్ణ
పెబ్బేరు

బి. సింధు(మీనా)
2సం॥, ఆగస్టు-30
స్వాతి-నాగరాజు
సత్తెనపల్లి-గుంటూరు

వి. మణికంఠ
4సం॥, ఆగస్టు-31
కోటమ్మ-వెంకటరంగయ్య
కంభం-ప్రకాశం

డి. కృష్ణసాయి ప్రసాద్
10 సం॥, సెప్టెంబర్-2
యశోదలక్ష్మి-వెంకటాచారి
వట్టిమర్తి-నల్లగొండ

సిరి
1సం॥, ఆగస్టు-2008
స్వరాజ్యం-రాజు
హైదరాబాద్

వి. రంగ శ్రావణి
7సం॥, ఆగస్టు-31
కోటమ్మ-వెంకటరంగయ్య
కంభం-ప్రకాశం

హేమా తనిష్క
ఆగస్టు
భార్గవి-సుబ్బారావు
భీమడోలు-ప॥గో॥

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు-పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై <u>కలర్ ఫొటో</u> అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

బి.పవన్‌కళ్యాణ్
7సం॥, సెప్టెంబర్-2002
కోటేశ్వరి-సుబ్బారావు
నందిగామ-కృష్ణా

కథా నిలయం

మనలో మాట

దేవుడికిక్కూడా ఒక ఉత్తరం!

దేవుడా,

నిన్నేమని సంబోధించాలో కూడా తెలియటం లేదు! ఎప్పుడూ ఇలాంటి అవసరం రాలేదు మరి. నిన్ను కొంతమంది భక్తులూ, పరమ భక్తులూ... అనాథ రక్షకా, ఆపద్బాంధవా, ఆర్తనాద పరాయణా... అనడం ఇప్పుడు గుర్తొస్తోంది! కానీ, నిన్ను నువ్వే రక్షించుకోలేవు. నీ ఇంటిని నువ్వే కాపాడుకోలేవు. ఇక ఇలాంటి విశేషణాలూ, విలక్షణాలూ నీకెందుకు స్వామీ?!

భక్తకోటిలో నీకు శతకోటి పేర్లు.. సహస్ర నామాలు... ఏ పేరున పిలిచినా పలుకుతావంటారు. కష్టాల్లో ఉంటే కాపాడతావంటారు. ఆపద్బాంధవుడివని, లోకరక్షకుడివని కీర్తిస్తారు. మరి నువ్వు ధరించే ఆభరణాలను అలవోకగా తరలించి, తాకట్టు కొట్టులో పెట్టేస్తే... ఉలకలేదేం స్వామీ?

ఎక్కడ ఎవరేం చేసినా నీకు తెలుస్తుందంటారు. సర్వాంతర్యామివని, సర్వజ్ఞుడివని స్తుతిస్తారు. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని చెబుతారు. పూజారి నగలు నొక్కేసిన సంగతీ, ఎకరాలకెకరాల భూమిని ఆసాములు అనుభవిస్తున్న సంగతీ నీకు తెలియదా స్వామీ? తెలిసీ తెలియనట్టు ఉంటే- నువ్వూ దొంగవే అవుతావు. దొంగలతో కుమ్మక్కయినట్టు అపకీర్తి పొందుతావు. పూజారుల చోరకళ, ఆసాముల స్వాహాకళ నీ మహత్తులను మించిపోయాయంటే- సామాన్యుడివవుతావు. ఏదీ స్వామీ ఇందులో నిజం? ఏమిటి ప్రభూ నీ సమాధానం?

సింహాచలంలో దొంగలు పడ్డారు. రాయలు నాటి పతకాలను రాత్రికి రాత్రే కొట్టేశారు! వందలాది ఎకరాల మాన్యం ఆక్రమణల పాలయింది. అన్నవరంలోనూ ఇంతే! సత్రం భూములన్నీ చిత్రంగా మాయమైపోతున్నాయి. దుర్గ ప్రాంగణంలోనూ దుర్మార్గాలకు లెక్క లేదు. తిరుపతి అవినీతికి అక్షయభాండం అయ్యింది. వేములవాడ, యాదగిరి ... ఏదైతేనేం? ఒక్కొక్క క్షేత్రం సహస్ర అక్రమాల క్షతగాత్రం!

దిక్కు లేనివాడికి దేవుడే దిక్కంటారు. పాపం.. ఇన్ని అక్రమాలూ, అన్యాయాల మధ్య దేవుడా.. నీకు దిక్కెవరు? 'ఉన్నావా? అసలున్నావా?' అని ఉన్నావో లేదో తెలియని నిన్ను ప్రశ్నించడం కాదు మేమిప్పుడు చేయాల్సింది. నువ్వున్నా లేకపోయినా- నీకూ, నీ దేవేర్లకు బోలెడు బంగారు నగలున్నాయి. వేలాది ఎకరాల భూములున్నాయి. భవంతులూ, వసతిగృహాలూ, సత్రాలూ సంతర్పణాలూ సవాలక్ష ఉన్నాయి. వాటి పక్కనే దొంగకళ్లు వేసుకొని- చోరులూ, స్వాహాకారులూ వందల్లో, వేలల్లో ఉన్నారు.

వాళ్లందరినుంచి నీకు రక్షణ కావాలి!

జనంనుంచి ధాన్యం, స్వేదం కక్కించి కరిగించి- అప్పటి రాజులు, ఇప్పటి అజ్ఞాత భక్తులూ ఆడంబరంగా సమకూర్చిన దేవుడి మాన్యాలను, బంగారు ఆభరణాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. జనం సొమ్ము జనానికి దఖలు పడేదాకా జాగ్రత్తగా కాపాడుకోవాలి!

పాపుల నుండి రక్షణకు ఏం చేస్తావో ఏమో. అంతా నీ చిత్తం స్వామీ...

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
తెల్సా	...	6
విజ్ఞాన వీచిక	...	7
సీరియల్	...	8
ఆరోగ్యం	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
నవ్వుల్ పువ్వుల్	...	17
కవిత్వమ్	...	18
క్రైమ్ కథ	...	19
బంగీజంప్	...	22
కొత్తపుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ముందుకు నడిపిన స్త్రీమూర్తి

బహుముఖీన సుదర్శనం... *10*

కథ ... 20

ఆయా



కింగ్ ఆఫ్ టెన్నిస్

టెన్నిస్ రారాజు రోజర్ ఫెడరర్ గురించి ఆదివారం అట్టమీది కథ ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. నేటి యువతకు స్ఫూర్తి, టెన్నిస్ ఆటకు వన్నె, దేశానికే కీర్తి తెచ్చిన ఫెడరర్ ది గ్రేట్ సాధించిన పతాకాలు, అవార్డులు, కీర్తి ప్రతిష్టలు క్రీడలకే ఆదర్శం. రాబోయే కాలంలో మరిన్ని విజయాలు సాధించి ప్రపంచంలో టెన్నిస్ ఆటకు తిరుగులేని మహరాజుగా రోజర్ నిలవాలని ఆశిద్దాం!

రాజు, గనపవరం.

కడుపుబ్బ నవ్వుకున్నాం

ఆగస్టు 16వ తేదీ స్నేహలో అట్టమీది కథగా టెన్నిస్ రారాజు రోజర్ కథనం ఎంతో ఆసక్తికరంగా వుంది. కాలువల నిర్మాణం ఆరంభమైన దృగ్విషయంతో తెల్సా నచ్చింది. చూద్దామాలో నైమిశారణ్యం బావుంది. గని సీరియల్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. 'చేసేద్దాం, నేర్చుకుందాం' వంటి అంశాలతో బాలనేస్తాలు ఆకట్టుకుంటోంది. అనేక ప్రధాన సుగంధాలు, గింజల గురించి సమ్‌థింగ్ స్పెషల్ లో తెలుసుకున్నాం. జ్ఞాపకాలు ఫీచర్‌లో 'పల్లె మారిపోయిందన్న' రాము ఆవేదనలో ఎంతో నిజముంది. మనలోమాటగా గడ్డి లభించని మూగజీవుల దుస్థితి హృదయ విదారకంగా ఉంది. ఒక్కటైనా రామకృష్ణ కార్టూన్ కడుపుబ్బ నవ్వించింది. ధన్యవాదాలు.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

ద్రోహమే...

పశువులకు ఓట్లు లేకపోవచ్చు. పాలు ఇస్తాయి. పాలు ఇవ్వాలంటే మేత పెట్టాలి. మేత పెట్టకుంటే ద్రోహమౌతుంది. పల్లెలు పాడుబడుతుండగా, పట్టణాలు పసందుగా మారుతున్నాయి. టెన్నిస్ రారాజు రోజర్ అత్యంత ధైర్యశాలి. పప్పుల పొడి బాగుంది. సమ్‌థింగ్ స్పెషల్ లో వచ్చిన మెంతులు, యాలకులు... మొదలైన దినుసుల గురించిన వివరణ నచ్చింది. అందమైన పూదోట నిజంగానే అందంగా వుంది.

వాస్తురామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

సుడోకు ఇవ్వొచ్చుగా...

ప్రజాశక్తి ఆదివారం స్నేహలో సుడోకు పజిల్ కూడా వస్తే బాగుంటుంది. ఇది పిల్లలకు, పెద్దలకు అందరికీ ఉపయోగకరంగా వుంటుంది. ఈ సుడోకు పజిల్స్ పూర్తిచేయడం వల్ల అల్జీమర్స్ వంటి వ్యాధుల నుండి దూరంగా ఉండొచ్చని ప్రజాశక్తి లోని రక్ష పేజీలో రాయడం జరిగింది. కావున దీనిని గమనంలోకి తీసుకుని సుడోకు పజిల్ ప్రారంభించగలరు. ఈ సుడోకు ప్రతి రోజు ఫీచర్ పేజీలో ప్రచురిస్తే బాగుంటుంది. దయచేసి ఈ అంశాన్ని పరిశీలించగలరు.

పసుపులేటి రమాదేవి,
కూకట్‌పల్లి.

పర్సా 'స్ఫూర్తి' బాగుంది

ప్రజాశక్తిలో చేసిన మార్పులు బాగున్నాయి. ముఖ్యంగా ఆదివారం అనుబంధం స్నేహ చాలా బాగుంటోంది. అందులో 'స్ఫూర్తి'లో ప్రచురిస్తున్న అంశాలు బాగున్నాయి. ముఖ్యంగా ఈ వారం 'జీవన సమరం' నవల గురించి కామ్రేడ్ పర్సగారు తెలియజేసిన విషయాలు చాలా స్ఫూర్తిదాయకంగా వున్నాయి. వెంటనే ఆ నవల చదవాలనిపించే విధంగా ప్రేరణ కలిగింది. ఆ నవల అందరికీ అందుబాటులో లేదు. దానిని ప్రజాశక్తి ప్రచురణగా పునర్ముద్రణ వేయగలరు. లేనిచో 'స్నేహ'లో గానీ, ప్రజాశక్తిలో గానీ డైలీ సీరియల్‌గా వేయాలని మా కోరిక. మా కోరికను మన్నిస్తారని ఆశిస్తున్నాము.

రమ, హైదరాబాద్.

పల్లెలు మారిపోయాయి

ఈ వారం స్నేహలో వచ్చిన జ్ఞాపకాలులోని 'నా పల్లె మారిపోయింది' అనే ఫీచర్ బాగుంది. ఇప్పుడు పట్టణాలేవో పల్లెలేవో తెలియకుండా వున్నాయి. స్ఫూర్తిలో పర్సా సత్యనారాయణ గారు చెప్పినవి చదువుతుంటే మనకు తెలియకుండానే మనలో స్ఫూర్తి నిండుకుంటుంది. జీవన సమరం నవల వెంటనే చదవాలనిపిస్తోంది. టెన్నిస్ ఆటగాడైన రోజర్ ఫెడరర్ గురించి మాకు తెలియని విషయాలెన్నో అట్టమీది కథ ద్వారా తెలుసుకున్నాం. 'క్విట్ ఇండియా' కవిత బావుంది. మనలో మాట లో చెప్పినట్లు ఇకమీదట మనుషులకు తిండి, పశువులకు గడ్డి మాత్రమే కాదు పక్షులు కూడా కడుపు నింపుకోలేని పరిస్థితి వస్తుందేమో అనిపిస్తోంది. ఏలేవాళ్లకెప్పుడూ ఏ కరువూ రాదు కానీ పాలితులకు మాత్రం ఎప్పుడూ ఏదో రూపంలో కరువు వుంటూనే ఉంది.

సంధ్య, పిడుగురాళ్ల.





కొబ్బరి ఉండలు

కావలసిన వస్తువులు

ఎండు కొబ్బరి చిప్పలు -4
నువ్వులు - 150 గ్రా
వేయించిన శనగపప్పు -1/2 కిలో
బెల్లం - 1/2 కిలో

తయారుచేసే విధానము

ముందుగా ఎండు కొబ్బరి తురుముతో ఎండు కొబ్బరిని తురుము కోవాలి. ఈ కొబ్బరి తురుమును, బెల్లం, శనగపప్పు, నువ్వులు అన్నీ కలిపి రోట్లో వేసి బాగా దంచాలి. శనగ పప్పును ముందుగా దంచి తీసి, నువ్వులు దంచుకొని, తరువాత ఎండు కొబ్బరి తురుము, బెల్లం దంచి మొత్తం కలిపి కాసేపు దంచాలి. ఇలా చేస్తే దంచటం త్వరగా అవుతుంది. ఇవి చిన్న చిన్న వుండలుగా చేసుకొని మూత వున్న డబ్బాలో వుంచితే 20 రోజుల వరకు నిల్వ వుంటాయి. ఇందులో వన్నీ కూడా మంచి బలవర్ధకమైన పదార్థాలు. రోజుకి 1 చొప్పున తింటే ఆరోగ్యానికి చాలా మంచిది.

మెంతి పెరుగు

కావలసిన వస్తువులు

పచ్చిమిరపకాయలు - 4
పెద్ద ఉల్లిపాయ -1
పోపు సామాను -కరివేపాకు
పసుపు -1/2 టీ స్పూను
అల్లం-1/2 అంగుళం ముక్క
ఉప్పు- తగినంత,

తయారుచేసే విధానము

అల్లం, మిర్చి ఉల్లిపాయ కూడా సన్నగా ముక్కలు తరుగుకొని పెరుగులో వేయాలి. ఉప్పు కూడా వేసి పసుపు వేయాలి. పొయ్యి మీద చిన్న బాండీ పెట్టి కాగిన నూనెవేసి పోపు వేయాలి. చిట పటలాడిన తరువాత పెరుగులో వేసుకోవాలి. ఇది అన్నంలోకి చాలా బాగుంటుంది.

సగ్గుబియ్యం వడలు

కావలసిన వస్తువులు

సగ్గుబియ్యం - 125 గ్రాములు, వేరుశనగ పప్పు- 250 గ్రాములు
బంగాళ దుంప -1 (పెద్దది), ఉప్పు-తగినంత
కారం - 1 స్పూన్, జీలకర్ర - 1/2 స్పూన్

తయారుచేసే విధానం

ఒక గంట ముందుగా సగ్గుబియ్యాన్ని నీళ్ళలో నానబెట్టుకోవాలి. నానిన తరువాత సగ్గు బియ్యం రెట్టింపు అవుతాయి. పచ్చి వేరుశనగ పప్పుని రోట్లో వేసి మెత్తగా దంచి పిండిని పళ్ళెంలోకి తీసుకోవాలి. బంగాళ దుంపను ఉడకబెట్టి పైపొట్టు తీసి దానిని కూడా చేత్తో పిండిలాగ నలపాలి. తరువాత నానిన సగ్గుబియ్యం, దంచి పెట్టుకున్న శనగ పిండి, బంగాళ దుంపల పొడి కారం, ఉప్పు, జీలకర్ర వేసి బాగా కలపాలి. కొంచెం నీళ్ళు పోసి మెత్తగా చేసిన తరువాత ఉండలుగా చేసి, దానిని అప్ప మాదిరిగా తట్టి నూనెలో వేసి, ఎర్రగా వేగిన తరువాత తీసుకోవాలి.

కాజాలు

కావలసిన వస్తువులు

మైదాపిండి లేక
గోధుమపిండి - 1/2 కిలో
నూనె - 1/2 కిలో
జీల కర్ర లేక
వాము- 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - సరిపడా

తయారుచేసే విధానము

పిండి శుభ్రముగా బాగు చేసుకొని, ఉప్పు, షోడా ఉప్పు, జీలకర్ర వేసి పూరీ పిండి మాదిరిగానే కలుపుకోవాలి. (జీలకర్ర, వాము పిల్లలకు మంచిది.) ఇది కొంచెం నానాక కాస్త కాస్త పీట మీద వేసి పూరీలాగానే వత్తాలి. చాకు తీసుకొని ఈ పూరీ మీద క్రాసుగా ముక్కగా కోయండి. అలాగే రెండో పక్కనుండీ కోయండి. లేకపోతే చిన్న సీసా మూత తీసుకొని పూరీ మీద నొక్కండి. గుండ్రటి ముక్కలుగా వస్తాయి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగిన తరువాత ఈ కోసి పెట్టుకున్న ముక్కలు వేసి చిల్లుల గరిటతో కలియ బెట్టండి. దోరగా వేగిన తరువాత పైకి తీసి వేయండి. ఇవి వారం రోజుల వరకు నిల్వ ఉంటాయి.



కొబ్బరి ఉండలు
సగ్గుబియ్యం వడలు
మెంతి పెరుగు
కాజాలు

డి.భిక్షవతి
ఐద్వా సీనియర్ నాయకులు

ముందుకు నడిపిన స్త్రీమూర్తి

మా ఊళ్లో బాల సంఘం బలంగా వుండేది. నేనూ అందులో చేరాను. అందుకేనేమో ప్రజలు...సమస్యల గురించిన అవగాహన ఆ వయసులోనే కొద్దిగా వుండేది. అప్పుడు చదివిన చిన్ని చిన్ని పుస్తకాలూ అందుకు కారణమైవుండొచ్చు. ఇకపోతే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 'జోయా' తదితర పుస్తకాలు వచ్చేవి. వాటిని చదివేవారం. అనేక దేశాలలో నాజీలకు తెలియకుండా కుటుంబాలను సంరక్షించుకోవడానికి పడే యాతన, దేశం కోసం ప్రదర్శించే ధైర్యసాహసాలు మాకు తెలుస్తుండేవి. అలాగే అప్పటి నవశక్తి, ప్రజాశక్తి పత్రికలు వస్తుండేవి. అందులో మీరట్ కుట్రకేసుల్లో పట్టుబడిన వారి గురించిన వార్తలు ఫొటోలు, ఉరితీసినవారి ఫొటోలు వస్తుండేవి. వాటిని మేం జాగ్రత్తగా చదివి, కత్తిరించి గోడలమీద అతికించేవారం. మరి దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిమీద అప్పట్లో మాకు అంత అభిమానం, గౌరవం వుండేవి. బ్రిటీష్ వారిపట్ల అసహ్యం వేసేది. బెంగాల్‌కరువు వచ్చినప్పుడు డబ్బు పోగుచేశాం. కొంచెం పెద్దయ్యాక పెళ్లిళ్లు...కాపురాలు..పిల్లలు. ఈ చక్రంలోకి అడుగెట్టాకే అమ్మ, జీవనసమరం, ఇంద్రధనస్సు, బీళ్లుదున్నారు, తండ్రులు-కొడుకులు...వంటి పుస్తకాలెన్నో చదివాను. వీటిలో ఎక్కువగా నవలలే . మా ఇంట్లో రష్యన్ నవలలు ఎక్కువగా వుండడం కూడా అందుకు ఒక కారణమనుకుంటా. అదే మా పిల్లలకు వచ్చింది. రష్యన్, చైనా నవలలు పిల్లలందరూ ఇష్టపడి చదివేవారు. ఇక మన 'తెలుగుగడ్డ' వుండనే వుంది. ప్రతి ఒక్కటి ఎంతో ఉత్తేజాన్నిచ్చేది. 'ఇంద్రధనస్సు' నవల చదివినప్పుడు చాలా ఆసక్తిగా అనిపించింది. జర్మన్ సైనికులు ఒక గ్రామాన్ని ఆక్రమించుకున్నప్పుడు మగవాళ్లంతా యుద్ధానికి వెళతారు. మహిళలు, పిల్లలు మాత్రమే మిగులుతారు. సైనికులకు ఓ గెరిల్లా మహిళ చిక్కుతుంది. ఆమె గర్భిణి. ఆమెను వారు పెట్టే హింసలు చదువుతుంటే ఎంతో బాధ కలుగుతుంది. ఆఖరుకు తిండి, నీళ్లు కూడా ఇవ్వరు. జోయా అనే పాప ఆమెకు రొట్టె ఇవ్వడానికి వెళితే కాల్చి చంపేస్తారు. ఆ పాప తమ్ముడు నేలమీద పాక్కుంటూ వెళ్లి చివరికి ఒక రొట్టె ముక్క ఇచ్చొస్తాడు. పసివారి దగ్గరనుంచి ప్రతి ఒక్కరూ ఇలా నాజీలను ఎదుర్కోవడం చాలా స్ఫూర్తిదాయకంగా అనిపించేది చదివినప్పుడు.

వీటన్నిటిలోకి 'జెన్నీ మార్క్స్' అనే చిన్ని పుస్తకం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దీన్ని డీవీఎస్‌గారు 'ఈ పుస్తకం చదువు' అంటూ ఇచ్చారోసారి. ఊళ్లోనే వున్న పార్టీ నిర్వహిస్తున్న గ్రంథాలయంలోంచి పుస్తకాలు ఎంపిక చేసి ఇస్తుండేవారాయన. ఆ గ్రంథాలయాన్ని వల్లూరిపల్లి నాగేశ్వరరావు గారు నిర్వహించేవారు. అలా నాచేతిలోకి వచ్చిన ఆ పుస్తకంలోని విషయాలను ఇప్పటికీ మరువలేను. సమాజంలో ఒక మహిళ నిర్వహించగల ఉన్నతమైన పాత్రకు రూపం ఇస్తే...వస్తే...అది జెన్నీ మార్క్స్‌లాగే వుంటుంది. ఆ పుస్తకంలో జెన్నీ పడిన కష్టాలు చదివి 'ఇదిగో ఇలా వుండాలి' అనుకున్నా ఆనాడే. 1952 నుంచి నిన్న మొన్నటి వరకు మహిళాసంఘంలో, ప్రజలలో పనిచేయడానికి స్ఫూర్తినిచ్చింది ఆ చిన్ని పుస్తకమే. వ్యక్తులు మాత్రం మానికొండ సూర్యావతిగారు, చెన్నుపాటి హనుమాయమ్మగారే.

ఉపాధ్యాయ సంఘ నిర్మాణం కోసం పరితపించి సాధించి చూపిన లక్ష్మయ్యగారి భార్య హనుమాయమ్మగారు. ఆయనకు వచ్చే అలవెన్సు తక్కువ. ఆవిడ నెలరోజులపాటు రోజూ ఒకే చీర కట్టుకోవడాన్ని చూచి

తన భర్త మార్క్స్ ప్రపంచ మానవాళి కోసం... పేద ప్రజల కోసం ఒక సిద్ధాంతాన్ని స్థిరీకరించడం కోసం అంతా చేస్తున్నాడన్న విషయాన్ని గ్రహించింది కాబట్టే ఆమె అంత పేదరికాన్ని చిరునవ్వుతో ఎదిరించింది. సరిగ్గా 'అమ్మ' నవలలో తల్లి కూడా ఇలానే భావిస్తుంది. తన కుమారుడు పావెల్ చేసేది సరైనదే. అతను తప్పుడు పనులకు పాల్పడడం లేదు. అనుకునే అతనికి అన్నివిధాలా సహకరిస్తుంది. ఈ విషయంలో నామీద వీరి ప్రభావం వుందేమో! డీవీఎస్‌గారు దాదాపు పదేళ్లపాటు విశాలాంధ్రలో అలవెన్స్ తీసుకోకుండా పనిచేశారు. ఇంటిదగ్గర నుంచి వచ్చే ఆదాయంతోనే సరిపెట్టుకునేవారం. 'విశాలాంధ్ర' నుంచి బయటికొచ్చి 'జనశక్తి' పెట్టాక కూడా అంతే. డివిఎస్ క్యాన్సర్‌కు గురై ప్రభుత్వ అజమాయిషీలోనే ఆసుపత్రిలో వున్నారు. డిసెంబర్ 31న విపరీతంగా రక్తం కక్కుకుని "డాక్టర్! డోంట్ మేక్ మై బర్త్ డే యాజ్ మై డెత్ డే" అన్నారు. జనవరి 1 ఆయన పుట్టిన రోజు. అదంతా చూచి విపరీతమైన వేదన, బాధకు గురయ్యానని "జెన్నీని ఆదర్శంగా తీసుకున్నావు కదా. అదే పట్టుదలతో నీవు పనిచేయాలి. బాధను దిగమింగుకో" అని చెప్పారు. అన్ని సందర్భాలలోనూ నా వెంట జెన్నీమార్క్స్ ఇచ్చిన స్ఫూర్తి వుంది కాబట్టే ఐదు దశాబ్దాలు ప్రజలమధ్య, మహిళా ఉద్యమాల్లో పనిచేయగలిగాను.

చలించిపోయాను. రోజూ ఉదయాన్నే ఆఫీసుకు వచ్చేటప్పుడు ఆ చీర కట్టుకురావడం .. సాయంత్రం వెళ్లగానే దాన్ని ఉతికి ఆరేయడం. మళ్లీ మరునాడు అదే కట్టుకుని బయలుదేరడం.. ఏదైనా సాయం చేయబోయినా తీసుకునేవారుకాదు. అలాంటివారు ఇప్పుడెక్కడున్నారు!

ఎన్నోసార్లు ఆ పుస్తక స్ఫూర్తి నన్ను ముందుకు నడిపించింది. వివాహానంతరం డి.వి.ఎస్.గారు బందరులో రహస్యంగా గడపాల్సి వచ్చింది. ఆయన కొరియర్‌గా వున్నారు. ఇంట్లోనే సైక్లోస్టైల్ మిషన్లుండేవి. కరపత్రాలను, పార్టీ పత్రాలను కాపీలు చేసి వాటిని బాధ్యులకు చేర్చే బాధ్యత చూస్తుండేవారు. ఇరుగు పొరుగు అని లేదు. ఎవ్వరితో మాట్లాడకూడదు. వెలేసినట్టుండేది. ఎవరితో ఒక్కముక్క మాట్లాడకుండా ఏమిటి? అనిపిస్తుండేది ఎప్పుడైనా! గర్భవతిని కావడంతో మా నాన్నగారు నన్ను ఇంటికి తీసుకెళ్లారు. ఇదిలా వుంటే ఓ రోజు డివిఎస్‌గారిని పోలీసులు అరెస్టు చేశారు. అదృష్టవశాత్తూ అరెస్టుకు రెండు రోజుల క్రితమే సైక్లోస్టైల్ మిషన్లను అక్కడినుంచి మరో చోటికి పంపేశారు. అయితే పోలీసులు మాత్రం 'వాటిని ఎక్కడకు పంపారు? మీకు ఎక్కడినుంచి వచ్చాయి? జిల్లా కమిటీ సభ్యులు ఎక్కడున్నారు?' వంటి ప్రశ్నలు కురిపించి ... విపరీతంగా హింసించారు. ఈలోపే కొందరు పోలీసులు మా ఇంటికి వచ్చి అక్కడేమైనా మిషన్లున్నాయేమోనని వెతికారు. దొరకలేదనుకోండి. అయితే మీరట్ కుట్రకేసులో చిక్కుకున్న వారి ఫొటోలను గోడమీద చూచి 'ఇవి ఇక్కడికెలా వచ్చాయంటూ' ప్రశ్నలతో వేధించారు. 'మా పిల్లలు చిన్నతనంలో పేపర్లలో వచ్చినవాటిని అతికించారని' మా తల్లిదండ్రులు చెప్తే ఒక పట్టాన నమ్మలేదు. ఇక డీవీఎస్‌గారి విషయం! పోలీసులు ఎంత హింసించినా ఒక్క ముక్క కూడా బయటకు పొక్కలేదు. కానీ ఇవన్నీ భరిస్తూ... ఇరుగుపొరుగుతో కూడా మాట్లాడకుండా...రహస్యంగా ఇక్కడ ఎందుకుండాల్సి వచ్చిందీ అని ప్రశ్నించుకుంటే ఒక సమాధానం వచ్చేది. ఉద్యమానికి ఊపిరి వంటి కార్యకర్తలను కాపాడడం కోసమే ఇక్కడ రహస్య జీవనం గడపాల్సి వచ్చిందని అర్థమైంది. ఇదంతా ఆ పుస్తకం చదివాను కాబట్టే అలా నిబ్బరంగా, ధైర్యంగా వుండగలిగాను. అదే ఆ పుస్తకం చదవకపోతే మరోలా అనిపించేదేమో!

'జెన్నీ మార్క్స్' పుస్తకం చిన్నదే అయినా అందించే సందేశం పెద్దదే. జెన్నీ ధనిక కుటుంబం నుంచి వస్తుంది. అంతేనా! అసమాన సౌందర్యరాశి. ఏ కులీన కుటుంబానికైనా ఇట్టే కోడలు కాగల అర్హతలన్నీ ఆమె సొంతం. కానీ తన సోదరుడు ఎడ్గార్ సహ అధ్యాయి మార్క్స్‌ని ప్రేమిస్తుంది. ఆర్థిక అంతస్తులలో రెండు కుటుంబాలకు ఆమడ దూరం. మార్క్స్ మహా మేధావి. భావుకుడు. విప్లవకారుడు. జెన్నీలోని కళాకారిణి, అంతఃసౌందర్యం, మేధస్సు అతడిని కట్టిపడేస్తుంది. అందుకే తన అంతస్తుకు ఏమాత్రం సరితూగకపోయినా మార్క్స్‌నే పెళ్లి చేసుకుంటుంది. అప్పటి నుంచి ఎన్నో కష్టాలను అనుభవిస్తుంది. ఓవైపు కుటుంబ బాధలు, మరోవైపు తిరుగుబాటు దారులకు ఆయుధ అవసరాలు, తమ దగ్గరున్న సంపదను దేనికి ఖర్చు చేయాలి? ఆ సంపద తమ కుటుంబానికి కలిగించగల భద్రతను, ఇవ్వగల సౌఖ్యాన్ని కాదని విప్లవకారుల ఆయుధాలకు తమ దగ్గరున్న సొమ్మును విరాళంగా ఇస్తారు. వారి ఆదర్శం అది. యూరప్‌లో ప్రజా తిరుగుబాట్లు జయప్రదమౌతాయి. వీటిలో మార్క్స్ పాత్ర ఎంతో ఆదరణ పొందుతుంది. కానీ ఎన్నోసార్లు రాజ్య హింసను, పిల్లలకు పాలు, రొట్టె కూడా పెట్టలేని దయనీయమైన పరిస్థితిని చవిచూస్తుంది. జబ్బు చేస్తే పిల్లలకు మందులు కొనిపెట్టలేని దైన్యాన్నీ అనుభవిస్తుంది. కానీ... తన భర్త మార్క్స్ ప్రపంచ మానవాళి కోసం... పేద ప్రజల కోసం ఒక సిద్ధాంతాన్ని స్థిరీకరించడం కోసం అంతా చేస్తున్నాడన్న విషయాన్ని గ్రహించింది కాబట్టే ఆమె అంత పేదరికాన్ని చిరునవ్వుతో ఎదిరించింది. సరిగ్గా 'అమ్మ' నవలలో తల్లి కూడా ఇలానే భావిస్తుంది. తన కుమారుడు పావెల్ చేసేది సరైనదే. అతను తప్పుడు పనులకు పాల్పడడం లేదు. అనుకునే అతనికి అన్నివిధాలా సహకరిస్తుంది. ఈ విషయంలో నామీద వీరి ప్రభావం వుండేమో! డీవీఎస్‌గారు దాదాపు పదేళ్లపాటు విశాలాంధ్రలో అలవెన్స్ తీసుకోకుండా పనిచేశారు. ఇంటిదగ్గర నుంచి వచ్చే ఆదాయంతోనే సరిపెట్టుకునేవారం. 'విశాలాంధ్ర' నుంచి బయటికొచ్చి 'జనశక్తి' పెట్టాక కూడా అంతే. డివిఎస్ క్యాన్సర్‌కు గురై ప్రభుత్వ అజమాయిషీలోనే ఆసుపత్రిలో వున్నారు. డిసెంబర్ 31న విపరీతంగా రక్తం కక్కుకుని "డాక్టర్! డోంట్ మేక్ మై బర్త్ డే యాజ్ మై డెత్ డే" అన్నారు. జనవరి 1 ఆయన పుట్టిన రోజు. అదంతా చూచి విపరీతమైన వేదన, బాధకు గురయ్యానని "జెన్నీని ఆదర్శంగా తీసుకున్నావు కదా. అదే పట్టుదలతో నీవు పనిచేయాలి. బాధను దిగమింగుకో" అని చెప్పారు. అన్ని సందర్భాలలోనూ నా వెంట జెన్నీమార్క్స్ ఇచ్చిన స్ఫూర్తి వుంది కాబట్టే ఐదు దశాబ్దాలు ప్రజలమధ్య మహిళా ఉద్యమాల్లో పనిచేయగలిగాను.

ఓ మహిళ ఎలా వుండాలి అంటే నిర్వచనంగా చెప్పదగిన జెన్నీ మార్క్స్ జీవితగాథను తెలిపే ఈ పుస్తకాన్ని చదవమని ఎందరికో చెప్పాను. మరెందరో (మహిళాసంఘ) కార్యకర్తల చేత చదివించాను కూడా.

★

వీటన్నిటిలోకి 'జెన్నీ మార్క్స్' అనే చిన్ని పుస్తకం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దీన్ని డీవీఎస్‌గారు 'ఈ పుస్తకం చదువు' అంటూ ఇచ్చారోసారి. ఊళ్లోనే వున్న పార్టీ నిర్వహిస్తున్న గ్రంథాలయంలోంచి పుస్తకాలు ఎంపిక చేసి ఇస్తుండేవారాయన. ఆ గ్రంథాలయాన్ని వల్లూరిపల్లి నాగేశ్వరరావు గారు నిర్వహించేవారు. అలా నాచేతిలోకి వచ్చిన ఆ పుస్తకంలోని విషయాలను ఇప్పటికీ మరువలేను. సమాజంలో ఒక మహిళ నిర్వహించగల ఉన్నతమైన పాత్రకు రూపం ఇస్తే...వస్తే...అది జెన్నీ మార్క్స్‌లాగే వుంటుంది. ఆ పుస్తకంలో జెన్నీ పడిన కష్టాలు చదివి 'ఇదిగో ఇలా వుండాలి' అనుకున్నా ఆనాడే. 1952 నుంచి నిన్న మొన్నటి వరకు మహిళాసంఘంలో, ప్రజలలో పనిచేయడానికి స్ఫూర్తినిచ్చింది ఆ చిన్ని పుస్తకమే. వ్యక్తులు మాత్రం మానికొండ సూర్యావతిగారు, చెన్నుపాటి హనుమాయమ్మగారే.

తెలుసా!

బుల్లి సైకిళ్ళు

జయేష్ పాండ్య చిన్న సైకిల్‌ను తయారు చేశాడు. అది ఎంత చిన్నదో కొలతలు చూసి తెలుసుకోవచ్చు. దీని పొడవు 5. 25. సెం.మీ, ఎత్తు 3.8 సెం. మీ. బరువు 30 గ్రాములు. ఈ సైకిల్‌ను గేర్లు, పెడల్స్ చెయిన్ బ్రేకులతో తయారు చేయడానికి మూడు నెలల కాలం పట్టిందట. ఈ సైకిల్‌కు సరిపడా ఎత్తులో వున్నవారు దీనిని చక్కగా తొక్కవచ్చునట. జయేష్ ఇంకా ఒక టాండెమ్ (ఇద్దరు లేదా ముగ్గురు తొక్క గలిగినది) సైకిల్ మోడల్‌ను కూడా తయారుచేశాడు. దాని కొలతలు ఈ విధంగా ఉన్నాయి. పొడవు 6.8 సెం.మీ, ఎత్తు 3.9 సెం.మీ బరువు 40 గ్రాములట. మినియేచర్ సైకిళ్ళలో జయేష్ తయారు చేసిన ఈ సైకిళ్ళే చాలా చిన్నవిగా గుర్తింపు పొందాయట.

ఢిల్లీకి చెందిన 23 ఏళ్ళ రాకేష్ శర్మ తయారు చేసిన మినయేచర్ సైకిల్ కూడా చాలా చిన్నదే. ఈ సైకిల్ తయారీలో ఏమేమి వాడాడో చూద్దాం. దీని బ్రేకులకు స్ప్రింగును, చక్రాలుగా టేపురికార్డర్ కాసెట్ రోలర్సును, చైన్‌గా ఒక రబ్బర్ బాండ్‌ను వాడాడు. ఈ సైకిల్ పెడల్స్ చెక్కతో తయారు చేశాడట. 20 గ్రాములు బరువున్న ఈ సైకిల్ పొడవు 5.5. సెం.మీ ఎత్తు 4 ఉన్నదట.

ఎముకలతో ఇళ్ళు

నైజీరియాకు చెందిన ఇరాస్తా తెగవారు వారి ఇళ్ళను జంతువుల ఎముకలతో నిర్మించుకుంటారు. ఒక రకమైన జిగురుతో వారు ఈ ఎముకలను జతపరచి వాటిని ఎండబెడతారు. అవి ఎండి బాగా బిగిసిన తరువాత వాటిని తమ గృహాల నిర్మాణంలో ఉపయోగిస్తారు. వెయ్యి సంత్సరాల క్రితం ఇలా ఎముకలతో నిర్మించబడిన ఒక ఇల్లు వీరి గ్రామంలో ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలిచి ఉన్నది.

పాము గూళ్ళు

పశ్చిమ కనుమలలోనూ, అండమాన్ ద్వీప ఈశాన్య ప్రాంతంలోనూ కన్పించే 'ఓఫియో ఫాగస్ హన్నా' రకానికి చెందిన కింగ్‌కోబ్రాలు గూళ్ళను నిర్మిస్తాయని కనుగొన్నారు. ఒక్కో గూడు 30 సెంటీ మీటర్ల పొడవు వుంటుందట. ఈ గూళ్ళను ఆకులను చుట్టి తయారు చేస్తాయి. ఈ రకానికి చెందిన పాములు మాత్రమే గూళ్ళు నిర్మిస్తాయని తెలుస్తోంది.

టన్నెల్ ట్రీ

కాలిఫోర్నియా (యు.ఎస్.) లోని టన్నెల్ ట్రీ (సొరంగ మార్గం తొలచబడిన వృక్షం) చాలా ప్రసిద్ధిపొందింది. అయితే 1969 అది కూలిపోవడంతో కూలిపోయిన వనోవృక్షంగానే మిగిలిపోయింది. ఈ వృక్షాన్ని 1881 లో తొలిచి మార్గం ఏర్పరిచారు. లోపల సొరంగమార్గం 8 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు ఉండేది. ఈ వృక్షం, పొడవు 71.6 మీటర్లు. అంటే ఇంచుమించు మన ఢిల్లీలోని కుతుబ్‌మీనార్ ఎత్తు అన్నమాట. ఈ వృక్షం వయస్సు 2.200 ఏళ్ళుంటుందని అంచనా.

విజ్ఞాన వీచిక

మనుషుల్లో వ్యాధులను నిర్ధారించడానికి అనేక రకాల పద్ధతులున్నాయి. వాటిలో కొన్ని పరీక్షల ద్వారా వ్యాధి వచ్చే అవకాశాలను కూడా ముందుగానే కనిపెట్టే అవకాశం ప్రస్తుతం వుంది. అదే విధంగా నేరాల నిర్ధారణలో కూడా కొన్ని రకాల పరీక్షలు అందుబాటులో వున్నాయి. కానీ మనుషులు నేరస్థులుగా మారే అవకాశాలను ముందుగానే తెలుసుకునే పరీక్షలేమైనా ఉంటే బావుంటుంది కదా! కానీ వీలౌతుందా?

నేరస్థులను పసిగట్టగలం

- డా॥కాకర్లమూడి విజయ్

వీలౌతుందని శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఒక వ్యక్తి ముందు ముందు హింసా ప్రవృత్తిని అలవర్చుకొని నేరస్థుడిగా మారతాడో లేదో నిర్ధారించవచ్చని అంటున్నారు. ఈ దిశలో చాలా కాలంగా విస్తృతంగా అధ్యయనం జరుగుతోంది.

కొన్ని దశాబ్దాలకు పూర్వం నేరప్రవృత్తి వంశపారంపర్యంగా వ్యాపిస్తుందని అనుకునేవారు. అదొక్కటే కాకుండా ఆ వ్యక్తి తాలూకు పరిసరాలూ, అతని స్నేహాలు కూడా అందుకు తోడౌతాయని కొందరంటున్నారు. అయితే చిన్నప్పటి కుటుంబ పరిస్థితి చాలా కీలకమైందని అనేక మంది భావిస్తున్నారు. కుటుంబ వాతావరణం సరిగా లేకపోవడం, ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం, పేదరికం, దారిద్ర్యంతో పాటు తల్లిదండ్రుల మధ్య నిత్యం కొట్లాటలు వంటివి పిల్లల్లో అభద్రతాభావం, ఆందోళన పెంచుతాయి. తద్వారా వారిలో ఎవరో ఒకరిపై కక్ష సాధించాలనే తపన పెరిగి నేరాలకు (సమాజంలోని కట్టుబాట్లకు విరుద్ధంగా తిరగబడడం) పాల్పడడం ప్రారంభమౌతుంది. చిన్నప్పుడే పిల్లలపై అనవసర ఒత్తిడి, అవమానం, వేధింపులు వంటివి వారిని తల్లిదండ్రుల నుండి దూరం చేస్తాయి. ఆ క్రమంలో అసాంఘిక కార్యకలాపాలు వారికి ఆకర్షణీయంగా అగుపించి, వారిని నేరమయ ప్రపంచంలోకి నడిపిస్తాయి.

జన్యువుల పాత్రా తక్కువేం కాదు

ఇవన్నీ మానవులు నేరస్థులుగా మారడానికి దోహదపడే కొన్ని కారణాలు. ఇవి చాలా కీలకమైన కారణాలే గానీ, ఒక వ్యక్తి నేరస్థునిగా తయారు చేసేవి ఇవి మాత్రమే కాదు. అలా మారే లక్షణం జన్యు స్థాయిలోనే వుంటుందని నిపుణులు అంటున్నారు.

సాధారణంగా మానవుల్లో రెండు ప్రత్యేక క్రోమోజోములుంటాయి. వాటినే లైంగిక క్రోమోజోములంటారు. మానవుల్లో అవి X,Y. పురుషుల్లో ఒక X, ఒక Y క్రోమోజోము వుంటుంది (ఒక్కో కణంలో మరో 42 జతల క్రోమోజోములతో కలిసి). కొందరిలో మరో Y క్రోమోజోము అదనంగా వుంటుంది. అలా అదనంగా వచ్చిన క్రోమోజోము వల్లనే నేర స్వభావం పొడచూపుతుందని శాస్త్రవేత్తల అభిప్రాయం.

కనిపెట్టి కట్టడి చేయొచ్చు

ఈ అభిప్రాయం ఆధారంగానే నేరస్వభావులను ముందుగానే కనిపెట్టి, వారిని ఆ దారి పట్టకుండా చేయవచ్చనీ అంటున్నారు. ఈ క్రోమోజోముతో పాటు నేరస్వభావుల మెదడులో కూడా కొన్ని మార్పులు వుంటాయని తేలింది. వారి మెదడు పనితనం సాధారణ వ్యక్తుల కన్నా తక్కువ చురుకుగా వుంటుంది. కాబట్టి ఒక నిశిత మెదడుకు స్కానింగ్ ద్వారా నేర లక్షణాలు ఉన్నాయో లేదో నిర్ధారించవచ్చని అంటున్నారు.

....తక్కువైతే తిప్పలే

అలాగే సెరటోనిన్ అనే పదార్థం మోతాదు కూడా భవిష్యత్తు నేరస్థులను పసిగట్టడంలో తోడ్పడుతుంది. శరీరంలో సెరటోనిన్ మోతాదు ఎంత ఎక్కువ వుండే మనిషి అంత నెమ్మదిగా, సాత్వికంగా ఉంటాడని తేలింది. కాబట్టి ఆ పదార్థం ఎంత తక్కువ వుంటే అంత దారుణంగా తయారౌతారు. నేరస్థులలో మరింత సెరటోనిన్ పంపి, వారిని సాధారణ స్థాయికి తీసుకురావచ్చనేది కూడా ఒక అంచనా. సమస్య ఏమిటంటే, సెరటోనిన్‌ను సులభంగా నిర్ధారించే వీలు లేకపోవడం.

నెమ్మదిగా లబ్‌డబ్...

అదేవిధంగా గుండె సాధారణ స్థాయికన్నా నెమ్మదిగా కొట్టుకోవడం నిర్భయత్వాన్నీ, తెగింపునీ ఇస్తుందని తెలిసింది. నేరస్థులకు ఈ రెండు లక్షణాలూ ప్రామాణికమే. అలాగే కొన్ని హార్మోన్లు కూడా నేరస్వభావులలో (సాధారణ వ్యక్తులలో పోల్చినప్పుడు) వేరుగా వుంటాయి.

....నిబంధనేం లేదు

అయితే ఇవన్నీ సహజంగా వుండే లక్షణాలు. ఈ తేడాలవల్ల వ్యక్తులు మిగతావారికంటే భిన్నంగా వుంటారు కానీ కచ్చితంగా నేరం చేస్తారనే నిబంధనేం లేదు. వారిలో మిగతావారికంటే కోపం ఎక్కువ వుండవచ్చు. దేనికీ భయపడని తత్వం, తెగింపు, చొరవ, నిర్లక్ష్యం, ఆవేశం, మొండితనం వంటివి కూడా ఎక్కువ వుండవచ్చు. ఒక నేరం చేయడానికి ఇవి తోడ్పడతాయేమో కానీ ఈ లక్షణాలే నేరస్థులను తయారు చెయ్యవు.

పరిసరాలప్రభావం

ఈ అభిప్రాయంతో కొందరు విభేదించినా "జన్యువుల కారణంగా బహిర్గతమయ్యే లక్షణాలు తీవ్రతను పరిసర పరిస్థితులు బాగా ప్రభావితం చేస్తాయి. కాబట్టి జన్యువుల కారణంగా నేరస్థులయ్యే లక్షణాలున్నా, పరిస్థితులు తోడవ్వకపోతే ఆ లక్షణాలు బయటపడకపోవచ్చు" అని కొందరి వాదన. ఈ వాదనే బలంగా వినిపిస్తోంది.

కాబట్టి భవిష్యత్తులో నేరస్థులయ్యే అవకాశమున్న వారిని గుర్తించి... వారిని సరైన దారిలో వుంచగలిగితే విజ్ఞాన శాస్త్రం సమాజానికి మంచిచేసినదౌతుంది. ★

సీరియల్

గని



<u>జరిగినకథ:</u>

అఖిల భారత గని కార్మిక సంఘాల సమావేశం జరుగుతుంది. బికాస్, పాశ్వాన్ హాజరౌతారు. గనుల్ని జాతీయం చేయాలని, అందుకోసం కార్మికులు ఉద్యమించాలని అనుకుంటారు. అయితే దానివలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యేరీతిలో వివరించాలని భావిస్తారు. ఏదైనా ప్రశ్నిస్తేనే జీతంలో కోతపెట్టే యాజమాన్యాలు ఇంక గనులను జాతీయం చేయడానికి అంగీకరిస్తాయా? అన్న అనుమానమూ తలెత్తుతుంది. అయితే అది తమ ఒక్కరి కోరిక మాత్రమే కాదని, దేశ ప్రజలందరి మనోభీష్టమని ...ఉద్యమ రూపం దాల్చితే రాజకీయ స్వరూపం వచ్చేస్తుందనుకుంటారు. మరోవైపు బికాస్‌కు పెళ్లి సంబంధం చూస్తాడో పెళ్లిళ్ల పేరయ్య. ఆ విషయం చెప్పడానికి జమునాదేవి ఇంటికి బయలుదేరతాడు. ఉదయాన్నే అయితే టిఫిన్, కాఫీ అక్కడే పూర్తిచేయవచ్చన్నది అతని ఆలోచన. అప్పుడే కాఫీ తాగే పనిలో వుంటారు భార్యాభర్తలిరువురూ. ఆ తర్వాత...

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(ఇరవై రెండవ భాగం)

ముసలాడు చిన్నగా నవ్వి! "నీకు అమ్మాయిని చూసిపెడితే, మా అమ్మాయిని ఎవరు పోషిస్తారు?!! అన్నాడు.

"దేవుడు కాళ్ళూ చేతులూ ప్రసాదించాడు. ఇక తిండికి లోటేంటి?"

వీళ్ల సంభాషణను ఆలకిస్తోన్న జమున క్రోధారుణ నేత్రాలతో చూస్తూ, "ఇప్పుడే విడాకుల పత్రం మీద సంతకం చేసి నా దారిన నేను వెళ్ళిపోతాను. నేను సోమరిపోతునేం కాను. గట్టిగా చెబితే, ఈ ఇంట్లో రెండింతలు చాకిరీ నాదే" అంది.

సంభాషణను దారి మళ్ళించాలన్న ఉద్దేశ్యంతో ముసలాడు "పెందరాళే వొచ్చేశాను. కాసిన్ని కాఫీ నీళ్ళు దక్కుతాయా?" అంటూనే అరుగుమీదున్న గిన్నె లోంచి నీళ్ళు ముంచుకొని, పుక్కిలించి ఉమ్మి మొహం కడుక్కున్నాడు.

తనకోసమని గ్లాసులోకి వొంపుకొన్న కాఫీని ముసలాడికిచ్చేసి, గిన్నె అడుగున మిగిలిన కాఫీ చుక్కల్ని నోట్లో పోసుకుంది జమునా కుమారి. వేడిగా ఉన్న గ్లాసును తాను కప్పుకొన్న దుప్పటి చివర్లతో పట్టుకొని పెద్దగా శబ్దం వచ్చేలా కాఫీ జుర్రుకున్నాడు ముసలాడు, తన గ్రామీణ అలవాటును ప్రదర్శిస్తూ.

"ఉరుములూ మెరుపులు లేని వానలా ఉన్నట్టుంటి వచ్చేశావు మావా. ఊరక రారు మహాత్ములు అనికదా అంటుంటారు" అన్నాడు జమున భర్త చిన్నగా నవ్వుతూ.

ముసలాడు కనురెప్పలు పైకెత్తాడు. మొహం బిగదీసుకొన్నాడు. తుమ్మబోతున్నవాడల్లా కాస్త ఆగి, మాట్లాడసాగాడు.

"బికాస్ కోసం ఓ అమ్మాయిని చూసొచ్చాను. బాదర బందీలేవీ లేని కుటుంబం. బికాస్ గురించి దాపరికం లేకుండా చెప్పాను. "ఉడుకు నెత్తురు కదా అలాగే ఉంటాడు, పెళ్లయ్యాక మారిపోతాడు" అంటూ అమ్మాయి తల్లిదండ్రులు సర్దిచెప్పుకొన్నారు. ఇలా అర్థం చేసుకొని, అమ్మాయిని ఇవ్వడానికి ముందుకు రావడమే గొప్ప విషయం కదా!" అన్నాడు.

బికాస్‌ని ఓ ఇంటివాడ్ని చేయడం తమ కర్తవ్యంగా భావించి వాళ్ళు కూడా ముమ్మరంగా సంబంధాలు చూస్తున్నారు. ప్రతిచోటా "కార్మిక సంఘం, పోరాటం అంటూ, పోలీసుల చేతుల్లో దెబ్బలు తింటూ శాంతియుత జీవనం లేనివాడికి పిల్లనిస్తామా?" అంటున్నారు! వాళ్ళను కోపగించుకోవడం అర్థరహితం. "మనమైనా ఇలాగే ప్రశ్నించేవాళ్ళం" అనుకొంటారు జమునావాళ్ళు. అలాంటిది బికాస్‌ను అర్థం చేసుకొని, అమ్మాయిని ఇవ్వడానికి ముందుకొచ్చారంటే ఈ సంబంధాన్ని ఖాయం చేసుకోవడం మంచిదని భావించి, "మంచి వాళ్ళలా తోస్తున్నారు. బికాస్‌తో మాట్లాడి చెబుతాం" అంది జమున.

గాలి వేగానికి అనుగుణంగా ఎగసిపడే కెరటంలా ముసలాడి మొహంలో అత్యాశ ప్రతిఫలించింది. అతడు ఎంతో గాలించి ఈ సంబంధం తీసుకొచ్చాడు. జమునావాళ్ళు కళ్ళలో వత్తులేసుకొని జీవిత పర్యంతం వెదకినా ఇటువంటి సంబంధం దొరకదు. అందుకు ప్రతిఫలంగా వాళ్ళు ఎంత ఇచ్చినా అది తక్కువే అవుతుంది. పెండ్లి జరగనీ, తర్వాత ప్రతిఫలం గురించి పట్టుబటొచ్చు. పెళ్లి జరగడం, జరగకపోవడం, తన చేతుల్లో లేదు. సంబంధం చూసి పెట్టినందుకు ఇచ్చే ప్రతిఫలం మాత్రం ఇప్పుడే ఇచ్చేయాలి సుమా!" అంటున్నాయి అతడి కళ్ళు.

కోడిపుంజు కోసం మాటువేసిన పిల్లిలా కనిపిస్తోన్న ముసలాడ్ని పరీక్షగా చూసింది జమున. లిప్తపాటులో అతడి ఆలోచనల్ని చదివేసింది. అతడ్ని ఆటపట్టించాలన్న ఉద్దేశ్యంతో "పెద్దాయనకు పెళ్లాంబిడ్డలు లేరు గదా! భూమ్యాకాశాలే దిక్కూమొక్కూ పాపం" అంది.

ముసలాడు ఇలాంటి వాటిని ఎన్ని చూళ్ళేదు! తగురీతిన గౌరవించిన వాళ్ళేకాదు, హీనాతిహీనంగా అవమానించిన వాళ్ళూ ఉన్నారు. ఎంతో మంది "వీడేమన్నా కొండలు పిండిచేశాడా! పొట్టపోసుకోవడం కోసం ఊరూరూ తిరుగుతాడు గదా! ఎవరో ఒకరు పిల్ల గురించో, పిల్లాడి గురించో చెబుతారు. అది మరొకరి చెవిన పడేస్తాడు. అంతేగా! అయినా తిండి పెడుతున్నాం. అది చాలదా? పెళ్లి చక్కగా చేయగలిగామంటే, బట్టలతో పాటు తృణమో పణమో చేతిలో పెట్టొచ్చు. వొట్టి నోటిమాటకు గండపెండేరాలు తొడుగుతారా ఏం?" అనడం విని బాధపడ్డ సందర్భాలు ఉన్నాయి. అయినా ఇవన్నీ పట్టించుకొంటే ఎలా బతగ్గలడు? దేవుడి మీద భారం వేసి జీవన యానం చేస్తున్నాడు. ఆమె సున్నితమైన మాటలకు ఇలా బదులిచ్చాడు.

"మీరు సొంతూరులోనే హాయిగా సేద్యం చేసుకొంటూ, గనిలో పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. మేము ఊరూరూ తిరుగుతూ మీ పిల్లలు హాయిగా బతకడానికి సహాయం చేస్తున్నాం. అయినా ఫలితం లేకుంటే మీరు మాత్రం పనిచేస్తారా!" అని ప్రశ్నించి, ముసలాడు తన పరిస్థితినీ అవసరాన్ని చెప్పక చెప్పాడు.

మునలాడి ఆవేదన జమునకు అర్థమైంది. "పెద్దాయనా! ఏదో పరిహాసానికి అన్నాను గానీ నీ కష్టం నాకు తెలియదా ఏం? నేనేమైనా పరాయిదాన్నా?" అంది అతడ్ని శాంతింపజేస్తూ.

ఎద్దు శ్వాస పీలుస్తున్నట్టు ఉండుండి వీస్తోన్న గాలి అతడ్ని స్పృశించింది. మనసులోని ఆవేదన చెమట రూపంలో వెలువడింది. "నీ గురించి నాకు తెలియదా తల్లీ! అయినా తల్లీ బిడ్డలకైనా ఎవరి కడుపు వాళ్ళది కదా! ఎవర్నీ తప్పుపట్టలేం" అన్నాడు. జమున ఇంట్లోకి వెళ్ళొచ్చి, కొంత పైకం అతడి చేతిలో పెట్టి "పెండ్లి జరిగాక తగినంత ఇస్తాను పెద్దాయనా!" అంది ఆప్యాయంగా. మునలాడు కృతజ్ఞతాపూర్వకంగా నవ్వి సెలవు తీసుకొన్నాడు.

✡ ✡ ✡

కార్మికులు పని పూర్తి చేసి, తిరుగుముఖం పట్టారు. బొగ్గును తవ్వి పోసి అలసిపోయిన కార్మికులు నత్త నడక నడుస్తున్నారు. అలుపూ ఆవేదనా కలగలిసి వాళ్ళ ముఖవర్చస్సును పీల్చేసినట్టు కాంతివిహీనంగా కనిపిస్తున్నారు. నల్లద్రాక్షపళ్ళ నురుగులా వాళ్ళ మొహాల మీద అక్కడక్కడా నూనె జిడ్డు.

తొలకరిజల్లు మొదలైంది. గాలిహోరుకు, భూమ్యాకాశాల మధ్య సుళ్ళు తిరిగే ధూళి. గడ్డివామూ, చూరు మీది కసువూ మేఘశకలాల్లా దూరంగా విసిరేసినట్టు వెళ్లిపోయాయి. ప్రజలెవరూ కళ్ళు తెరిచి చూసే అవకాశం లేకుండా కళ్ళల్లో పడుతోన్న దుమ్ము, ఎగురుతోన్న కాకి నోట్లోంచి జారిన ఎంగిలిలా పెద్ద పెద్ద చినుకులు. మొదటి చినుకు రాలగానే వేడెక్కిన నేలలోంచి ఆవిరి వెలువడింది. మురికి పేరుకుపోయిన మట్టి తాలూకు వాసన మనసును ఆహ్లాదపరిచింది. సన్నటి వెండితీగలు జారిపడుతున్నట్లు వానజల్లు, ఒంట్లోని వేడిని తగ్గించుకున్నట్లు మేకలు, కోళ్ళూ ఆరుబయట నిలబడి సుఖం అనుభవిస్తున్నాయి. వీధులనిండా వెల్లువ. ఆవు పేడ, పందులూ కోళ్ల మలమూత్రాలూ వాననీటితో కలిసి, కరిగి వెగటు పుట్టిస్తున్నాయి. చిన్నపిల్లలు వానలో తడుస్తూ ఒకరి మీదొకరు నీళ్ళు చల్లుకొంటున్నారు. క్రమంగా వర్షం ఆగింది. అమ్మకానికి తీసుకొచ్చిన, నీళ్ళతో నిండిన పశువుల డొక్కలు మలమూత్ర విసర్జన చేయగానే ఎండిపోతున్నట్టు, వేలాడుతోన్న నల్లని మబ్బులు కాస్తా వాన వెలిసిపోగానే అదృశ్యమై నీలిరంగు ఆకాశం అగుపడుతోంది. నీటి బరువు తాళజాలక వంగిన చెట్టుచేమలు, మొక్కలు, స్నానం చేయించాక కాంతులీనుతున్న పిల్లాడి మొహంలా వెలిగిపోతున్నాయి.

వాన నుండి తప్పించుకోడానికి కొందరు కార్మికులు మొగసాలలో ఉండే మునిలాల్ ఇంట్లో చేరారు. అప్పుడో కార్మికుడు "తాను అంతమొందించదలచినవాడ్ని భగవంతుడు ముందుగా వెర్రివాడ్ని చేస్తాడని ప్రతీతి. ప్రస్తుతం మనల్ని భగవంతుడు అనేక విధాలుగా వెర్రివాళ్ళను చేస్తున్నాడు" అన్నాడు.

తనను ఆనుకొని నిలుచున్న తనయుడ్ని మృదువుగా నిమురుతూ మునిలాల్ అన్నాడు "నువ్వు చెబుతున్నదేమిటో బోధపడడంలేదు".

"పోరాటాలు, ధర్నాలు అంటేనే మన యజమానికి చేదుగా అనిపిస్తుంది. మైనింగ్ గుమాస్తా, మైనింగ్ సర్దార్ తదితరులంతా వాళ్ళు చూస్తుండగా మనం రెప్పలు మూసి తెరిస్తే చాలు, నిద్రపోయినట్టు పరిగణించి జీతంలో కోత విధించేస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం గనుల్ని జాతీయం చేయాలని ఉద్యమిస్తే ఇంకేమైనా ఉందా"?

మునిలాల్ చిరునవ్వు నవ్వి, కళ్ళు చిట్లించాడు. మెల్లగా, దృఢంగా చెప్పాడు. "మనం మాత్రమే ఉద్యమించడం లేదు. దేశవ్యాప్తంగా గని కార్మికులందరూ ఉద్యమిస్తున్నారు. కార్మికపక్షం వహించే రాజకీయ పక్షాలు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మన బానిస బతుకుల్లో మార్పు రావాలంటే ప్రైవేటు యాజమాన్యం నుంచి విముక్తి పొందాలి".

సన్నగా రివటలా ఉన్న మరో కార్మికుడు "నేను ఇలాంటి సమ్మెల్లో పాల్గొనలేను. ప్రస్తుతం కలోగంజో దొరకుతుంది. చిరుగులదో అతుకులదో ఏదైతేనేం, కట్టుకోడానికీ కప్పుకోడానికి బట్టలూ, దుప్పట్లుగా దొరుకుతున్నాయి. తలదాచుకోడానికి ఓ తావంటూ ఉంది. పల్లెలో నా బతుకు ఎలా ఉండేదో తెలుసా? మా నాన్న ఐదుగురు పిల్లల్ని భూమ్మీద పడేసి పైలోకాలకు వెళ్ళిపోయాడు. నేనే పెద్దవాడ్ని. పల్లెల్లో రోజూ పని దొరకదని వేరే చెప్పాలా? ఇల్లు గడవాలి. నాకు పదేళ్ళు. ఆవులను మేపుకొస్తే నాకు రెండు పూటల ఎండురొట్టెలు దొరికేవి. అమ్మ కొద్దిపాటి సంపాదనతో ఇల్లెలా గడుస్తుంది.? ఆమె అందంగా ఉండేది. డబ్బున్న వాళ్ళు అప్పుడప్పుడూ మా ఇంట్లో రాత్రుళ్ళు గడిపి వెళ్ళేవాళ్ళు. ఆ డబ్బులతో పెరగిన వాడ్ని... నాకు ఈ పనయినా దొరికింది. నా పెళ్ళాం మా అమ్మను అనుసరించాల్సిన పరిస్థితి రాకూడదని ఆశిస్తున్నాను... నాకు ఈ పాటి జీవితం చాలు..." అన్నాడు.

"అతడి మానసిక స్థితి ఉద్యమానికి వ్యతిరేకంగా ఉంది. దాన్ని అంగీకరించకపోయినా, అతడి గతం సానుభూతితో అర్థం చేసుకోదగింది. తమ శ్రామిక హస్తాలతో ప్రపంచాన్ని దీప్తివంతం చేసే కార్మికుడి జీవితంలో మాత్రం వెలుగు కనిపించదు!" అని నిట్టూర్చాడు మునిలాల్.

"నువ్వు ఇక్కడ ఉద్యోగంలో కొత్తగా చేరావు గనుక నీకు తెలియదు గానీ, పూర్వం ఇక్కడా అలాంటి పరిస్థితే ఉండేది. కార్మికుల ఇళ్ళల్లోని ఆడవాళ్ళమీద అధికారుల డేగచూపులు వాలేవి. ఎన్నో కష్టనష్టాలు చవిచూసి, ఎన్నో పోరాటాలు చేసి సంఘం పెట్టుకోగలిగాం. ఆ తర్వాతే మన స్థితిగతులు మెరుగుపడ్డాయి. నువ్వు ఇప్పుడు అనుకొంటున్నట్లుగా అప్పట్లో మేం భావించి ఉంటే, నీకే మాత్రం భద్రత ఉండేది కాదు" అన్నాడు.

ఈ మాటలతో అతడిలో తడబాటు కలిగింది. తన సహజ స్వభావాన్ని మరిచిపోయాడు. మనసును ఏదో చెప్పలేని భయం ఆవరించింది. గొంతు పిడచకట్టుకు పోయింది. పెదాలు తడారిపోయాయి. నాలుక ఎండిపోయింది. మనసులోని మాటల్ని పైకి చెప్పడానికి తటపటాయింపు. తన భావాలు ఏమాత్రం కనిపించనీయకుండా ఇలా అన్నాడు "దీనికి లోకానుభవం ఉండాలి. బావిలో కప్పలా బతుకుతోన్న నాకు అంతా గందరగోళంగానూ, భయంగానూ ఉంది. మందలో గొర్రెలా మీ వెనుకే నడవాల్సి ఉంటుంది".

ఈ సమాధానం విన్నాక, మునిలాల్ అనుకొన్నాడు

'ఓ వ్యక్తికి ధైర్యసాహసాలన్నవి, అతడి చుట్టూ జనం ఉండడం వల్ల కలిగేవి కాదు. స్వార్థ రాహిత్యం, త్యాగచింతన, అవగాహన వీటి వల్లే ధైర్యసాహసాలు సమకూరుతాయి. బికాస్ ఆ విధంగా కాకలుతీరిన యోధుడు. ఇవి లేనప్పుడు వ్యక్తిని అక్రమమార్గంలో నడిపిస్తుంది. అతడ్ని పిరికివాడ్ని చేస్తుంది'.

ఇదమిత్థమని తెలియని ఏదో భావం గుండెను మెలిపెడుతున్నట్టు అందరూ కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. అలసిపోయిన దేహాల్ని రేపటి కఠిన శ్రమకు, సమాయత్తం చేసుకోవాలి కదా. మునిలాల్ దగ్గర సెలవు తీసుకొని, గృహోన్ముఖులయ్యారు.

ఒక పర్యాయం బికాస్ చెప్పిన మాటల్ని మునిలాల్ గుర్తు చేసుకొన్నాడు. "జీవితంలో లెక్కలేనన్ని చిక్కుముళ్ళు. ఒక్కొక్కరికి ఒక్కో రకం సమస్య. వ్యక్తిగత సమస్యలు. ఎవరి సమస్యలు వాళ్ళవే గానీ ఉమ్మడి సమస్యలో మాత్రం అందరూ కలిసికట్టుగా ఒక్కతాటి మీద నిలబడితేనే పరిష్కారం సాధ్యపడుతుంది. దిగజారిన ఆత్మవిశ్వాసం భవిష్యత్తు తాలూకు కలలేవీ లేని జీవితం. ఈ పరిస్థితిలో ఉద్యమ మార్గాన్ని వదిలేయడం కంటే దారుణం మరొకటి ఉందా? పిరికిపందలుగా, ముఖప్రీతి రాయుళ్ళుగా, ఎంగిలి మెతుకులు గతికే హీనులుగా వొట్టి మాటలతో పొద్దు పుచ్చే, ఈ సిగ్గులేని జీవాలకు ఎప్పటికి ఈ విషయం బోధపడుతుంది? ఎలా అందరినీ ఒక్క వేదిక మీదకు తీసుకురావాలి? వీళ్ళు సంఘటిత పడితే, యావద్దేశమూ దీప్తివంతం కాదా? భయమన్నది మానవుడి క్రియాశీలత్వాన్ని పరిహాశిస్తుంది. ఎదిరించి పోరాడాలి. లేకపోతే అది వ్యక్తిని నాశనం చేస్తుంది. క్రియాశూన్యుడై నశించిపోవడం కంటే, దాన్ని నాశనం చేయడానికి కృషి చేయడమే వీరత్వానికి నిదర్శనం. మబ్బులు ముసిరిన ఆకాశంలో మెరుపు మెరిసినట్టు మనసులో మెదిలాయి బికాస్ పలుకులు. మునిలాల్ ఒళ్ళో తల పెట్టుకొని, కార్మికుల సంభాషణ అంతా విన్న మునిలాల్ కొడుకు తండ్రిని ఇలా ప్రశ్నించాడు.

(ఇంకావుంది)



సుదర్శనం సవ్యసాచి. కుంచె పడితే చిత్రకారుడు. కలం పడితె కవి, వ్యాసకర్త, జర్నలిస్టు, రచయిత. పాడితే గాయకుడు. నటిస్తే నటుడు, ఆలోసిస్తే సంగీతకారుడు. కెమెరా పట్టుకుంటే నిశ్చల చిత్ర గ్రాహకుడు. ఇంకా పరిశోధకుడు, ఉపన్యాసకుడు, విమర్శకుడు. వీటన్నిటికి మించి సామాజిక స్పృహ కలిగిన కళల వారధి. అందుకే కాసుల కోసం వెంపర్లాడకుండా సాదాసీదా జీవనం సాగిస్తున్న స్నేహశీలి. ఇటువంటి చిత్రకళాకారుడిని గుర్తించిన నిర్మాత, దర్శకుడు, రచయిత అభ్యుదయవాది బి. నరసింగరావు తాను నిర్మించిన 'రంగుల కల, మా ఊరు' చిత్రాలకు ఆర్ట్ డైరెక్టరుగా అవకాశమిచ్చారు. 1989లో నిర్మించిన 'దాసి' చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. ఈ చిత్రం జాతీయ స్థాయిలో ఐదు అవార్డులను గెలుచుకుంది. 1990లో తొలి సారిగా దక్షిణ భారతదేశానికి చలన చిత్ర రంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌కు ఆ విభాగంలో అవార్డు సుదర్శన్‌కు దక్కడం విశేషం. దాంతో పెట్టంపల్లి సుదర్శన్ తన ఇంటి పేరును నాటి నుంచి 'దాసి'గా మార్చుకున్నారు. చిరునామా నాగార్జున సాగర్ సార్థకమయ్యింది.

బహుముఖీన సుదర్శనం

- కె.వి

భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరు సల్పిన పోరాటాల పురిటి గడ్డ నల్లగొండజిల్లా మిర్యాలగూడలో సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించారాయన. తండ్రి మట్టయ్య స్వతహాగా కథకుడు. పౌరాణిక జానపదాల కళాకారుడు. బాల్యంలోనే మట్టిమనుషుల అసమాన పోరాటాలు, త్యాగాలు కళల ద్వారా విన్నాడు. కన్నాడు. తండ్రి వెంట జనపదాలు, పల్లెలూ పరికించాడు. విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలను అలవర్చుకున్నాడు. వారసత్వ వాసనలతో శ్రీశ్రీని శ్వాసించాడు. తదుపరి చలంను, రావిశాస్త్రిని ఆరాధించాడు. బాపును గురువుగా తలిచాడు. ఏకలవ్యుడైనాడు. గీతలు గీయించిన గురువు రామచంద్రానికి శిష్యుడయ్యాడు. కలం, కుంచె చేత పట్టాడు. విద్యాభ్యాసం పూర్తయ్యే దాక కుటుంబ జీవనం కోసం కమర్షియల్ పెయింటర్‌గా సైన్‌బోర్డులు, సినిమా పోస్టర్లు, వ్యాపార ప్రకటనలు రాశాడు. తదుపరి డ్రాయింగ్ మాస్టారుగా ప్రభుత్వ విద్యాశాఖలో ఉద్యోగం పొందాడు. జీతం కోసం ఉద్యోగం. తనలోని సృజన కోసం ప్రవృత్తిని కొనసాగించాడు. 1978లో నాగార్జున సాగర్ చేరాడు. కొలువు సాధించాడు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ మాస్టారుగా వృత్తి ధర్మం నేరవేర్చుతూనే నల్లగొండ జిల్లా కేంద్రంలో సాహిత్య, సాంస్కృతిక కళారంగాలలో కీలక పాత్ర పోషించాడు. తన కుంచెతో అద్భుత చిత్రాలు సృష్టించాడు. బహుముఖ ప్రశంసలు పొందాడు. పేరున్న రచయితల నవలలకు వందల కొలది ముఖ చిత్రాలు గీశాడు. పరిశోధన గ్రంథాలకు తన సృజనతో జీవం పోశాడు. ఎన్నో ఫోటో ప్రదర్శనలు నిర్వహించాడు.

దాదాపు 15 డాక్యుమెంటరీ లఘు చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశాడు. సుదర్శన్ మాస్టారుకు ఎందరో చిత్రకారులు కళాకారులు ప్రత్యక్షంగా పరోక్షంగా ఏకలవ్య శిష్యులయ్యారు. 'దాసి సుదర్శన్' జాతీయ స్థాయిలో అవార్డునందుకున్నా రాష్ట్రస్థాయిలో పురస్కారాలు అందుకున్న నంది అవార్డుల కమిటిలో సభ్యుడైనా, జాతీయ చలన చిత్ర జ్యూరీ కమిటీ మెంబరైనా ఏనాడూ మిడిసిపడలేదు. ఎదిగిన కొద్దీ వొదిగిపోయాడు. వృత్తి ధర్మాన్ని విస్మరించలేదు. జాతీయ పండుగలకు ప్రభుత్వ శకటాలు విద్యాశాఖ తరపున రూపొందించి ప్రముఖుల ప్రశంసలు పొందారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా నేషనల్ ఫౌండేషన్ అవార్డులతోపాటు ప్రముఖుల ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు.

చలన చిత్ర రంగంలో జాతీయ అవార్డు పొందినా రంగుల కలలు కనలేదు. విలువలు కలిగిన చిత్రాలలో అవకాశాలు వచ్చినప్పుడే పనిచేశారు. శతచిత్ర నిర్మాత డి. రామానాయుడు నిర్మించిన 'హరివిల్లు' చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసి ప్రశంసలు పొందారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా "నట్ట నడుమ నల్లగొండ" వ్యాసాలు ప్రచురించాడు. ఎన్.సి.ఇ.ఆర్.టి వారి నేతృత్వంలో ఒకటి నుండి 10 తరగతులకు సిలబస్ కమిటీలో సభ్యులుగా వున్నాడు. సాహిత్య సాంస్కృతిక కళారంగాలలో సమాంతరంగా ప్రతిభను కనబర్చారాయన. ఇటీవల సాహితి సదన్ జితెన్ సుదర్శనం అభినందన ప్రత్యేక సంచికను తెచ్చారు. పాఠకలోకానికి అక్షర పరిచయం చేశారు.

ఇక చిత్రకారునిగా అపరూప చిత్రాలను తన కుంచెతో అవిష్కరించాడు. స్పార్టకస్ నుండి రాధాకృష్ణుల వరకు. యథాతథ చిత్రాలు, రియలిస్టిక్ చిత్రాలు, ఆధునిక చిత్రాలు, క్లిష్టమైన నైరూప్య చిత్రాలను సృష్టించారు. ప్రముఖ కవులు రచయితలు శివారెడ్డి, అద్దేపల్లి లాంటి ఎందరెందరికో సుదర్శన్ భావాలే ముఖ చిత్రాలయ్యాయి. అయితే తన ప్రతిభను వ్యాపారాత్మకం చేసుకోవటానికి ఇష్టపడని చిత్రకారుడు సుదర్శన్.

దేశంలో, రాష్ట్రంలో వివిధ పత్రికలలో కార్టూనిస్టులుగా, ఆర్టిస్టులుగా పనిచేస్తున్న వారు సుదర్శన్ మాస్టారు శిష్యులుగా గర్వంగా చెప్పుకుంటారు. ఇండియా టుడే నర్సిం, చిత్ర లాంటి వాళ్ళు వున్నారు. తను ఇంతగా ఎదగడానికి నల్లగొండ జయమిత్ర మండలి ఎంతగానో తోడ్పడిందంటారు. నాగార్జున సాగర్‌లో 'అల' సాహిత్య సాంస్కృతిక వేదిక ద్వారా రాష్ట్రంలో లబ్ద ప్రతిష్టులైన వారినెందరినో రప్పించి సభలు జరిపించాడు. నిలువెత్తు పోట్రెయిట్లు గీశారు. ఇంతకీ సుదర్శనం బతకనేర్చిన వాడు కాదు. బతుకు నేర్పిన వాడు. నిత్య సృజనాత్మక కళాకారుడు. ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఆ సందర్భంగా సాగర్, మిర్యాల మిత్రులు ఘనంగా సన్మానించారు. సుదర్శన్ మాస్టారు ప్రవృత్తికి అంకితమై ముమ్ముందు చిత్ర కళారంగాలలో ఉజ్వలింప చేస్తారని ఆశిద్దాం.

★

ఆరోగ్యం

డిస్లెక్సియా పిల్లలు



కొంతమంది పిల్లలకు సాధారణ తెలివితేటలు ఉన్నప్పటికీ, తెలివితేటల్లో ఎలాంటి లోపం లేనప్పటికీ సరిగా చదవలేరు. వీరు పదాలను స్పష్టంగా ఉచ్చరించలేరు. అర్థం చేసుకోవటమూ ఇబ్బందే. ఇలాంటి లోపాలున్నట్లయితే దానిని లెర్నింగ్ డిజార్డర్‌గా పరిగణిస్తారు. ఈ లోపం దాదాపు 5 నుంచి 17 శాతం మందిలో ఉంటుంది. తెలివితేటలు సక్రమంగా లేనివారిలోనే కాకుండా బాగా ఉన్న వారికి కూడా ఈ డిజార్డర్ రావచ్చు. చదువులో మిగతా వారి కంటే వెనుకబడి ఒత్తిడి భరించలేక ఆత్మన్యూనతాభావానికి లోనుకావడం, లేదా అసాధారణ ప్రవర్తనలు ఉత్పన్నమౌతుంటాయి. మరైతే ఈ లోపాన్ని గుర్తించడమెలా? ఐదేళ్లలోపు పిల్లల్లో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి? ఇందులో ఎన్ని రకాలున్నాయి? నివారణ ఎలా? వంటి అంశాలను ఈ వారం తెల్సుకుందాం.

డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్
సైకియాట్రిస్ట్
అనంతపురం.
9848316994

ఈ లోపాన్ని ఏడు సంవత్సరాల వయసు దాటిన పిల్లల్లో సులభంగా గుర్తించవచ్చు. చదువు నేర్చుకునే విషయంలో మొదటి నుంచి చాలా నిదానంగా ఉంటారు. వాక్యాలను, పదాలను తప్పుగా పలకటం, పదాలను మధ్యలో తప్పించటం, అక్షరాలను మధ్యలో ఎత్తివేయడం, ప్రత్యామ్నాయ పదాలను మధ్యలో చేర్చడం, పదాలను తిప్పి చదవడం ఉంటాయి. జబ్బు తీవ్రతను బట్టి, వయస్సును బట్టి ఒక్కొక్కరిలో ఒక్కో రకంగా ఉంటుంది.

ఐదేళ్లలోపు పిల్లలలో...

మాటలు నేర్చుకోవటంలో ఆలస్యం కావడం, కొత్త పదాలను నేర్చుకోవడం పట్ల అనాసక్తి, నెమ్మదిగా ఉండటం, చేతివాటం, అభివృద్ధి చెందటంలో ఆలస్యం కావటం లాంటివి ఉంటాయి. స్కూల్‌కు వెళ్లే పిల్లలలో అక్షరాలు నేర్చుకోవడం, ఉచ్ఛరించడంలో ఆలస్యంగా ఉంటుంది. వస్తువుల పేర్లు, పదాలను గుర్తు తెచ్చుకోవటంలో ఇబ్బందిపడటం, కుడి-ఎడమలను, ముందు వెనుకకు కాస్త తికమకపడటం, శబ్దాలలో తేడా లేని పదాలను గుర్తించడం, పలకడంలోను లోపాలు ఉంటాయి. చూపు, వినికిడి లోపం లాంటివి లేనప్పటికీ వినడంలోనూ, గమనించడంలోనూ లోపాలుంటాయి.

రకాలు

ఈ డిజార్డర్ రావటానికి స్పష్టమైన కారణాలు తెలియనప్పటికీ పరిశోధనలో తేలిన విషయాలు గమనిస్తే ఎక్కువమంది మగపిల్లలలో ఈ లోపం గమనించవచ్చు.

ట్రామా డిస్లెక్సియా

చదవటానికి, రాయడానికి ఉపయోగపడే మెదడులోని సున్నితమైన భాగాలకు దెబ్బ తగిలినప్పుడు కాన్పు సమయంలో మెదడు ఒత్తిడికి గురైనప్పుడు, ఇన్‌ఫ్లుయెంజ్ లాంటి వ్యాధులకు లోనైనప్పుడు ఈ లోపం రావచ్చు.

ప్రైమరీ డిస్లెక్సియా

పెద్ద మెదడులోని ఎడమవైపు భాగంలో క్రియాలోపం ఉన్నప్పుడు రావచ్చు. ఈ రకం వంశపారంపర్యంగా ముఖ్యంగా మగపిల్లలో వచ్చే అవకాశం ఎక్కువ.

సెకండరీ డిస్లెక్సియా

ఈ రకం లోపం తల్లిగర్భంలో శిశువు పెరుగుతున్నప్పుడు హార్మోన్ల అసమతుల్యతకు గురైనప్పుడు వస్తుంది. వయసు పెరిగేకొద్దీ లోపాలు తగ్గుతాయి.

గుర్తించడం ఎలా?

ఈ లోపాన్ని గుర్తించడం కొంత క్లిష్టమైన పరిస్థితి. ఈ డిజార్డర్ పట్ల పూర్తిగా అవగాహన కల్గిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కాస్త సులభంగా గుర్తించవచ్చు. పిల్లల తెలివితేటలను (ఐ.క్యూ) అంచనా వేయడం చదివే సామర్థ్యం, పలికే విధానం, రాసే విధానం క్షుణ్ణంగా పరిశీలించాలి. దీంతో పాటు చూపు, వినికిడి లోపాలు లేవని నిర్ధారించుకోవాలి.

న్యూరాలజిస్టు, సైకాలజిస్టు, సైకియాట్రిస్టు, చిన్న పిల్లల డాక్టర్ల సహాయంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక విజ్ఞానం సహాయంతో ఈ డిజార్డర్‌ను నిర్ధారించవచ్చు.

నివారణా మార్గాలు

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ లోపాలున్నట్లు గుర్తించినట్లయితే నిపుణుల సహాయంతో కొన్ని సూచనలు నేర్చుకుని లోపాలను సరిదిద్దడానికి ప్రయత్నించాలి. పిల్లలపై ఒత్తిడి తేవడం, నిందించడం, ఇతర పిల్లలతో పోల్చడం చేయకూడదు. లోపాన్ని సరిదిద్దకుండా ఒత్తిడి పెంచినట్లయితే పిల్లలు చదువుపట్ల ఆసక్తి కోల్పోవడం, ఉన్న తెలివితేటలు ఉపయోగించుకోకపోవడం, ప్రవర్తనా లోపాలు రావడం, ఆత్మన్యూనతకు లోనై స్కూల్‌కు వెళ్లడానికి ఇష్టపడకపోవడం వంటివి జరుగుతాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చిన్న పిల్లల డాక్టర్, సైకాలజిస్టు, స్పీచ్‌థెరపిస్టు, సహాయంతో "CHILD STUDY TEAMS" ఏర్పాటు చేసి కొన్ని రకాల ప్రోత్సాహక పద్ధతుల్ని పాటించినట్లయితే ఈ లోపాన్ని సరిదిద్దవచ్చు.



★

పదాలు రాస్తే పోలా



పిడుగులూ... మీకు ఇంగ్లీషు ఎంత బాగా వచ్చో తెల్సుకోడానికి ఓ పరీక్ష పెడుతున్నాం. ఆంగ్ల అక్షరం 'O' వెంటవెంటనే రెండుసార్లు వచ్చేలా కొన్ని పదాలు రాయండి మరి.



ఐదు తేడాలు చెప్పేద్దాం

ఏమేం ఉన్నాయో వెతికేస్తే...

నేస్తాలూ! కిందున్న బొమ్మను చూడండి. అడవిలో ముగ్గురు పిల్లలు సరదాగా ఆడుకొంటున్నారు. మనం కూడా అలా ఆడుకుంటే చాలా బాగుంటుంది కదూ. సరేకానీ అందులో కొన్ని వస్తువులు, జంతువులు దాగున్నాయి. అవేంటో వెతకండి.

ఆకులతో మూషికం

హాయ్! ఈ వారం మీకోసం మూషికాన్ని అదేనర్రా ఎలుక బొమ్మ తీసుకొచ్చాం చూశారుగా. మీరు కూడా ఇలాంటి ఆకారాలున్న ఆకులు తీసుకుని తయారు చేయండే.



బాలనేస్తాలు

నేర్చుకుందాం



వృత్తాలెన్నోచ్!

ఫ్రెండ్స్... కింద కొన్ని వృత్తాకారాలు వున్నాయి చూశారుగా. అవి మొత్తం ఎన్నో చెప్పేయండి.



వావ్! ఎన్ని గొర్రెలో....

పిల్లలూ... చూడండి. ఇక్కడ బోలెడు గొర్రెలున్నాయ్. కానీ ఒకదానిమీద ఒకటి వుండి అవి ఎన్నో లెక్కపెట్టడానికి వీలులేకుండా వున్నాయి కదూ. కానీ వాటిని మీరు చకచకా లెక్కపెట్టి మొత్తం ఎన్నున్నాయో చెప్పాలి. సరేనా.





ఆ రెండు ఎక్కడ?

న్నారులూ...పైనేదో పజిల్లాంటిది ఉందికదా. కిందేమో అందులోని రెండు భాగాలు ఉన్నాయి. అవి ఎక్కడ అతికిస్తే సరిగ్గా సరిపోతాయో చెప్తారా.

జవాబులు

తేడాలు చెప్పేదాం? : 1.స్పూను తిరగబడి వుంది. 2. పాము నాలుక, 3. కొబ్బరిచెట్టు ఆకు, 4. కప్ప దగ్గరి గాలిబుడగ, 5. పక్షి కాళ్లు.

వృత్తాలెన్నోచ్... : 7

ఎన్ని గొర్రెలో... : 12

ఏమేం వున్నాయో వెతికేస్ : 1.చేప, 2. తాబేలు, 3.ఉడుత.

అట్టమీది కథ

ఉద్వేగాల చెలగాటం

- పీపీ

ఈ రోజుల్లో ఎప్పుడు ఎవరు మాట్లాడుకున్నా టీవీ ప్రసక్తి లేకుండా ముగియదు. ఒకప్పుడు 'సినిమాల్లో చూపించినట్టు' అనేవారు. ఈ రోజున ప్రతిదానికి టీవీనే ప్రస్తావిస్తున్నారు. ఎందుకంటే టీవీ జీవితాన్ని దృశ్యమానం చేసింది.

టెలివిజన్ కేవలం వినోద సాధనమే కాదు, సమాచార సాధనమే కాదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పార్శ్వాలన్నింటినీ ఒక్క దెబ్బలో సమన్వయ పర్చగలిగిన ఇలాంటి అపురూప సాధనం ఏదీ ఇంతకు ముందు మనుషులకు అందుబాటులో లేదు.

టీవీలో వచ్చే హింసా దృశ్యాలపైన లేదా వ్యాపార ప్రకటనలపైన తరచూ విమర్శలు వింటుంటాము. అవన్నీ నిజమే కాని అంతకంటే తీవ్రమైన ప్రభావం మన భావోద్వేగాలపై పడుతుంటుంది. అలాంటప్పుడు పది పదిహేనేళ్ల కిందటే ఈ మీడియా విస్తరించిన మన దేశం వంటి చోట్ల మరింత ఎక్కువగా ఈ ప్రభావం వుం డడం చాలా సహజం. మనకంటే దాదాపు యాభై ఏళ్ల ముందే టీవీ విప్లవం చూసిన అమెరికా వంటి దేశాల్లోనే దీని గురించి ఇప్పటికీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

టీవీ చూడాలంటే ఏకకాలంలో మన కళ్లు చెవులు కూడా పనిచేయాలి. ఏది ఎంత వరకు స్వీకరించాలి, ఏది అట్టిపెట్టుకోవాలి, ఏది తోసిపుచ్చాలి అని విశ్లేషించుకోవడానికి మెదడుకు వ్యవధి కావాలి కాని అంత వ్యవధి తీసుకోవడం అన్ని వేళలా సాధ్యం కాకపోవచ్చు. చూసే ప్రేక్షకుల పరిపక్వతను బట్టి అది ఆధారపడి వుంటుంది. అన్ని వయస్సుల వారు కలసి చూసే పరిస్థితిలో ఇది మరింత సత్యం. సమస్య ఏమిటంటే చూసే వారిపైనే కాదు, పాల్గొనే వారిపైన కూడా టీవీ కార్యక్రమాల ప్రభావం చాలా ఎక్కువగా వుంటుంది. అందుకే అది అన్ని విధాల మనుషుల భావోద్వేగాలతో ముడిపడిన వేల కోట్ల రూపాయల వ్యాపారం. సామాజిక కళాత్మక కార్యక్రమంగా కనిపిస్తుంటుంది. కనుక పూర్తిగా వ్యాపారం అనడానికి కూడా వుండదు. సమాచార సంబంధమైన విధినిర్వహణగా అనిపిస్తుంటుంది. కాని.. ఆ క్రమంలో మన కష్టసుఖాలూ, బాధలూ భావనలూ, ప్రేమలు, చావులూ, హత్యలూ, భక్తి, రక్తి అన్నీ బహిరంగ విన్యాసాలుగా మారిపోతుంటాయి. ఎప్పుడైతే బహిరంగ వ్యవహారాలయ్యాయో అప్పుడు వాటిని మరింత బాగా కనిపించేలా చేసే కృత్రిమత్వం చొరబడుతుంది.

జీడిపాకం సీరియల్స్‌లో ఒకప్పటి పాత సెంటిమెంట్లు గుప్పిస్తున్న తీరు సరే సరి. బహు భార్యత్వం, కుటుంబలాలలో కుళ్లు కుతంత్రాలే ఆసూయా ద్వేషాలూ, మూఢ నమ్మకాలు, దయ్యాలూ భూతాలూ లెక్కకు మిక్కుటంగా వీటిలో కనిపిస్తూనే వుంటాయి. ఒకప్పటి వందమంది సూర్యకాంతాలను మించిన ఆడ విలన్ల విజృంభణతో బుల్లి తెర హడలగొడుతుంది. మరీ తమిళనాడు నుంచి వచ్చే డబ్బింగ్ ధారావాహికల్లోనైతే ఆ వేష భాషలే ఒక ప్రత్యేక కోవలో వుండి ఒక విధమైన జుగుప్సను అసౌఖ్య భావనను మనలో నింపేస్తాయి. సినిమా మూడు గంటల్లో ముగిసిపోతుంది. కాని సీరియల్ నెలల తరబడి నడుస్తూనే వుంటుంది. చివరకు అవి పాత్రలని కూడా మర్చిపోయేంతగా వాటితో మమేకమై పోతారు.

టీవీ ఛానళ్లలో ఎక్కువ సమయం ఆక్రమించేది లైవ్ షోలు, టాక్ షోలు, స్పాన్సర్డ్ పోటీలు, వివిధ రకాల ప్రత్యక్ష ప్రసారాలు, క్రైం కథనాలు వగైరా వుంటాయి. ఇవి కల్పిత కథలను మించి మనస్సులపై ప్రభావం చూపిస్తుంటాయి. మన సినిమాలన్నీ ఫార్ములాలపై ఆధారపడి వుంటాయి. ప్రేమ, కుటుంబ సంబంధాలు, పగలు ప్రతీకారాలూ, శృంగారం, హింస వగైరాలతో రచయితలు దర్శకులు ఎంతో శ్రమపడి కథలు వండుతుంటారు. కోట్లు తగలేసి నిర్మిస్తుంటారు. కాని టీవీలలో ఆ శ్రమ లేకుండానే ఉద్వేగ ప్రేరేపణ జరిగిపోవడం గమనించని విపరీతం.

2000 కోట్ల వ్యాపారంలో ఒత్తిళ్లెన్నో!

మన దేశంలో ఏడాదికి రెండు వేల కోట్ల రూపాయల మేరకు వ్యాపార ప్రకటనలు వస్తుంటాయి.ఎన్ని చెప్పినా టీవీ మీడియాకు అవే ప్రాణాధారం. అడ్వర్టయిజర్లకు కావలసింది జనాన్ని అలరించే కార్యక్రమాలే గాని ఆలోచింపచేసేవి కావు. అదే సమయంలో కీలకమైన అంశాలను అందించినట్టుగా కనిపించాలంటే కృత్రిమమైన అంశాలతో ప్రేక్షకుల ఉద్వేగాలను ఆకట్టుకోవాలి. వ్యాపార ప్రకటనల సంగతి చెప్పనే అవసరం లేదు. అంద చందాలు, ఆకర్షణలే సర్వస్వమైనట్టు విలాసమూ వినియోగమే జీవితమైనట్టు చెప్పడానికి తారాతోరణంతో క్షణికమైన చిట్కా యాడ్లు ముంచెత్తుతుంటాయి. వీటిలోనూ స్త్రీలను చులకనగా చూపించడమే సర్వసాధారణం. తల్లిదండ్రుల ప్రేమనూ, దాంపత్య జీవితాన్ని, పిల్లల తెలివిని, యవ్వనాకర్షణనూ, ప్రతిదాన్నీ వస్తు జాలం చుట్టూ తిప్పే మాయా లోకం ఇది. వాటిని చూసి మతి పోగొట్టుకోవాలంటే ప్రేక్షకుల మెదళ్లు ఖాళీగా వుండాలి. కాలక్షేపం తప్ప ఆలోచన రాకూడదు. కఠోర జీవిత వాస్తవాలనుంచి పలాయనానికి దోహదం చేసే మిథ్యా ఉద్వేగాలలో ముంచి తేల్చడమే ఏతావాతా మీడియా తాత్వికత.

ఉదాహరణకు ఒక పిల్లవాడు విషాదకరంగా చనిపోయాడనుకుందాం. దాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం ఎలాగూ జరుగుతుంది.ఈ ప్రసారంతో పాటు అతనికి సంబంధించిన వారితో మాట్లాడించాలి. తలిదండ్రులతో మాట్లాడించడానికే ముందు ప్రాధాన్యత. కొంతమంది పట్టించుకోరు కూడా. కాని చాలామంది విషాద సందర్భాల్లో కూడా టీవీ మైకుల ముందు మాట్లాడ్డానికి సిద్ధమౌతారు. విషాదానికి సరిపడని రీతిలో కూడా వారు మాట్లాడ్డం కద్దు. అప్పటి వరకూ తాము ఇలాటి సందర్భాల్లో చూసిన రీతిలోనే మాట్లాడబోతారు. 'సరిగ్గా' రాలేదనుకుంటే ఆ టీవీ జర్నలిస్టు సూచనలు కూడా చేస్తాడు. ఆ దృశ్యాన్ని వూరికే చూపించినా, నేరుగా మైకు ముందు మాట్లాడించినా అసహజత్వం వచ్చేస్తుంటుంది. విషాద స్పర్శ పలచబడుతుంది. ఇదే పరిస్థితి సంతోష సందర్భాల్లోనూ కనిపిస్తుంది. ఆ విజయంలో విశిష్టత కన్నా వ్యక్తిగతంగా ఆకర్షణీయంగా చూపించడం ప్రధానమై పోతుంది. వారు కూడా ముందే ఒక ప్రత్యేక తరహాలో మాట్లాడ్డానికి చేయి వూపడానికి సిద్ధమై వుంటారు. విషాదం వినోదాలతో సంబంధం లేకుండా పక్కనుండి కనిపించాలనుకునే వారు సరే సరి. ఒకోసారి పరస్పరం పోటీ పడ్డం మరీ ఎబ్బెట్టుగా వుంటుంది. ఇవన్నీ కూడా సహజ స్పందనలను మొద్దు బారుస్తాయి.

లండన్‌లో రియాల్టీ షో సందర్భంలో శిల్పాశెట్టి జేడ్ గుడి వివాదం ప్రపంచ వ్యాపిత చర్చనీయాంశమై పోయింది. తర్వాత విచారకరంగా జేడ్ గుడీకి క్యాన్సర్ సోకింది. ఆమె తన ఆఖరి క్షణాలను కూడా టీవీ లైవ్ టెలికాస్ట్ హక్కులు అమ్మేసుకుంది. తన పిల్లల కోసం ఇదంతా చేసినట్టు చెప్పినా దాని వెనక సత్యం ఉద్వేగ వ్యాపారమే.

జేడ్ గుడీది విషాదాంతమైతే రాఖీ సావంత్ స్వయంవర వివాహ ప్రహసనం తాజా సంఘటన. తనకు కాబోయే వరుడిని ఎంచుకోవడానికి పురాణ కాలంలో వలె స్వయం వరం ఏర్పాటు చేసుకోవడం బాగానే వుంది.కాని దాన్ని బహిరంగ కార్యక్రమంగా మార్చుకోవడం ఈ తతంగానికి ముందస్తుగా అంత హంగామా దేనికి? పెళ్లి వ్యక్తిగత వ్యవహారమైతే వరుడి ఎంపిక మరింత వ్యక్తిగతంగా జరగాల్సిన తంతు. బుల్లితెరపై ఆమె ఒక్కో వరుణ్ని అడిగిన ప్రశ్నలు చూపించిన హావభావాలతో మామూలు ప్రేక్షకుడికి సంబంధం ఏమిటి? సినిమా తారల పట్ల ప్రత్యేకించి ఐటం సాంగ్స్ (వెనకటికి క్లబ్ డాన్స్ అనేవారు) నర్తకీమణుల పట్ల వుండే జనాకర్షణను ఇంకా చెప్పాలంటే పురుషాకర్షణను సొమ్ము చేసుకోవడం తప్ప ఇందులో వేరే పరమార్థం ఏమైనా వుందా? పిల్లలను కనడం, పాలివ్వడం కూడా టీవీ ఛానెళ్లకు అమ్ముకున్న హాలీవుడ్ తారామణుల గురించి లోగడ ఇదే శీర్షికలో చర్చించుకున్నాం కూడా. మీడియా వ్యక్తిగత జీవితాల్లోకి ఎక్కువగా తొంగి చూస్తుందని ఆరోపించేవారే ఇలాచేయడంలో ద్వంద్వత్వమే ఉద్వేగ వ్యాపారం!

టాక్‌షోలలో సెలబ్రిటీల వ్యవహారం కూడా కాసుల పంట పండిస్తున్నది. అమితాబ్ బచన్ కౌన్ బనేగా కరోడ్ పతితో మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా పరిఢవిల్లుతున్నది. ఒక్కో చోట ఒక్కో సెలబ్రిటీ. ఇక్కడ హోస్ట్ అక్కడ గెస్ట్. అక్కడ హోస్ట్ ఇక్కడ గెస్ట్. తారల గురించి ప్రేక్షకుల మనస్సుల్లో వుండే ఆకర్షణను, ఆసక్తిని సొమ్ము చేసుకునే ప్రశ్నలు అదే పనిగా అడుగుతుంటారు. మధ్యలో వారికి సంబంధించిన వారిని ప్రవేశపెడతారు. కౌగిలించుకోవడం, ఎత్తుకుని తిప్పడం, ఏవేవో సరస శృంగారాంశాలు ప్రస్తావించడం.. ప్రేమ ప్రశ్నలు కురిపించడం ఇదంతా సగటు మనుషులకు రంజుగా వుండేదుకే. ఇది కూడా ఒక్కసారితో పూర్తికాదు. దశలవారిగా సాగిపోతుంటుంది. వారు మాట్లాడేప్పుడు మరెవరినో వారితో ముడిపడినట్టు పేరున్నవారిని చూపించడం... ఇవే విషయాలు ఒకప్పుడు ఏ చవక బారు సినిమా పత్రికలోనో శృంగార పత్రికల్లోనో వస్తే తిట్టి పోసేవారు. కాని ఇప్పుడు నేరుగా సకుటుంబ మధ్యలోకి చొచ్చుకు వస్తున్నాయి...

అందాల పోటీలు, క్యాట్ వాక్‌లు, మిడ్‌నైట్ మసాలాలు(వాటి తాలూకూ ప్రచార ప్రకటనలు లేదా ప్రోమోలు మాత్రం అన్ని వేళలా వస్తుంటాయి మరి) ఎంత ఎబ్బెట్టుగా వున్నదీ నిత్యానుభవమే. విదేశీ చానళ్లపై మనకు ఎలాంటి అదుపు లేదు. పైగా మన ఛానళ్లు వాటికన్నా తీసిపోయింది కూడా లేదు. ఏతా వాతా ఏదో దేశంలో ఏదో అసభ్య అవాంఛనీయ కార్యక్రమం ప్రసారమవుతూనే వుంటుంది. 'ఎ' సర్టిఫికెట్ చిత్రాలలాగా 'ఎ' ఛానళ్లు కూడా వుంటున్నాయి. పాశ్చాత్య దేశాల్లో నీలి చిత్రాలు కూడా నేరుగా ప్రసారమవుతుంటాయి. వాటిని ఎవరూ పెద్దగా చూడరని, కొంతకాలం గడిస్తే మన దగ్గర కూడా అలాంటి స్థితే వస్తుందని కొంతమంది చేసే వింత వాదన. సాంస్కృతికంగా చారిత్రకంగా ప్రాచ్య పాశ్చాత్య దేశాల మధ్య వుండే తేడాను పట్టించుకోదు. ఒక విధంగా ఆ విష సంస్కృతిని స్వాగతించే ధోరణి..... వాస్తవం ఏమంటే పశ్చిమ దేశాల్లోనూ దీనిపై ఆందోళనలు లేకపోలేదు. కళాశాలల్లో తుపాకుల స్వైర విహారం, సామూహిక కాల్పివేతలు, స్కూలు పిల్లల గర్భధారణలూ ఇవన్నీ పై ప్రభావాల ఫలితమేనని వారూ అంగీకరిస్తున్నారు. ప్రత్యేకించి అమెరికాలోనైతే సెప్టెంబరు 11 తర్వాత పత్రికలు టీవీల ప్రభావాలను విడివిడిగా అధ్యయనం చేశారు. టీవీలు కలిగించే ఉద్వేగం చాలా ఎక్కువగా వుంటుందని నిర్ధారించారు.

ఇటీవల వరసగా పాటలు, డాన్సులు, విచిత్ర వేషాల పోటీలు జోరుగా సాగుతున్నాయి. ప్రతిభ గల వారు అనేక మంది పైకి వస్తున్నారు. అవకాశాలు



రాఖీ సావంత్



పొందుతున్నారు.అంతవరకూ బాగానే వుంది. కాని ఇదంతా జరుగుతున్న తీరులోనూ ఎంతో కృత్రిమత్వం .. చిన్నపిల్లలతోనూ ఒకప్పుడు మనం వద్దని తరిమేసిన మేజువాణీలనే భోగం డాన్సులను మించిపోయేలా జుగుప్సగొల్పే నృత్యాలు చేయించడం.. వాటిని ఆకాశానికెత్తుతూ న్యాయమూర్తులైన ప్రముఖులు మాట్లాడ్డం... వాటి కాన్సెప్ట్‌లోనే అసభ్యత పుష్కలంగా వుంటుంది. అదీగాక పోటీలో విజేతలను నిర్ణయించే తీరు, చేసే వ్యాఖ్యలు... కావాలని వివాదాలు ఆహ్వానించడం, వారి కోపతాపాలను చూపించడం, న్యాయమూర్తులను తిట్టించడం.. గెలుపు ఓటములపై తీవ్రమైన సంగీతం తో మార్చి మార్చి చూపించడం... అంతా ఉద్వేగ వ్యాపారమే!

సభ్యమైన పాటలతో సాగే సంగీత పోటీలోనూ ఇదే ధోరణి.చిన్న పిల్లలా పెద్దలా అన్నదానితో నిమిత్తం లేకుండా పాడిన వారిపై పొడుగాటి విశ్లేషణలు.. పూకదంపుళ్లు.. ఆ పైన మార్కుల ప్రకటన.. విజేతల ఎంపిక.. దానికి ముందు వారి అంచనాలపై ప్రశ్నల ప్రహసనం. ఎలిమినేట్ అయితే ఏదో కొంప మునిగిపోతుందనట్టు పెద్ద పెద్ద డైలాగులు.. వారికి ఏదో పెద్ద జీవిత సమస్యలా ఉద్బోధలు... విషాద గంభీర శబ్దాలు.... ముఖ కవళికలను క్లోజప్‌లో చూపించడం, వారు ఎంత ఉత్కంఠతో వూపిరి బిగబట్టి వుంటే అంత గొప్ప అన్నట్టు చిత్రించడం... ఫలితాల ప్రకటన తర్వాత వారిలో కొందరు కన్నీరు మున్నీరు కావడం.. వారితో పాటు న్యాయమూర్తులలోనూ విషాద భావనలు.. ఎంతో అసహజంగా అనవసరంగా జరిగే ఈ తతంగాన్ని టీవీ ఛానెళ్లు అనివార్యమైనదిగా చేశాయి.

పత్రికలతో పోలిస్తే మూఢనమ్మకాలను దొంగ స్వాములను ఎండగట్టడంలో టీవీ మీడియా మంచి పాత్ర వహించింది. కాని స్వభావ సిద్ధంగానే అది భక్తిప్రపత్తులకు ప్రచారక సాధనమవుతుంది. ఏ మారుమూల పల్లెలోనో జాతర లేదా తిరణాల వుంటే అక్కడికే పరిమితం. దాన్ని ఒకసారి చూపించి స్థానికులతో ఇంటర్వ్యూలలో చెప్పించిన తర్వాత అది మరింత విస్తృతమై కూచుంటుంది.

ఇక రాజకీయ విషయాల్లోనూ రెచ్చగొట్టేట్టు మాట్లాడితేనే ఎక్కువ ప్రచారం లభిస్తుందన్న భావం బలపడటానికి మీడియా చేయగలిగినంతా చేస్తోంది. దానిపై మళ్లీ ప్రతిస్పందనలు ఖండన మండనలు.. ఇలా ఉపయోగం కన్నా ఉద్వేగమే ప్రధానంగా రోజూ ఉదయాన్నే స్క్రోలింగ్‌తో అజెండా నిర్ణయమై పోతుంది. వార్త చదవడానికి, చూడటానికి చాలా తేడా వుంటుంది. ఏదైనా చూస్తే బావుండాలన్నది మీడియా అంతస్సూత్రం. అంటే వేడి పెంచాలి. గరం గరంగా వుండాలి. సమగ్రత కన్నా సంవాద శీలత ముఖ్యం.కోట్ల ఖర్చుతో నడిచే మీడియా వర్గ స్వభావం కూడా ప్రజల విజ్ఞానం పెంచడం కాదు, కాలక్షేపం చేయించడమే. అన్నీ చూపించినట్టు వుండాలి, కాని అసలైన సారాంశం అందకూడదు.

బహుశా ఈ ఉద్వేగ వ్యాపారానికి పరాకాష్ట అనదగ్గది ఇటీవల నడుస్తున్న 'సచ్ కా సామ్‌నా' అన్న రియాల్టీ షో. భార్యాభర్తలను పిలిపించి వారి మనసులో మాట చెప్పించడం. ఆ పైన దాన్ని సత్యశోధన యంత్రంతో పరీక్షించడం.. మరీ ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాల గురించి మాట్లాడించి, అది నిజమో కాదో పరీక్షించడం.. ఈ ఫలితాలు వెనువెంటనే వెల్లడవుతుంటాయి. దీనిపైన ఎంత విమర్శ వచ్చిందంటే ఈ కార్యక్రమాన్ని వెంటనే నిలుపు చేయించాలని సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఆ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికరమైన వ్యాఖ్యలే చేసింది. ఇలాటి కార్యక్రమాలు చాలా అభ్యంతరకరమైనవని అభిప్రాయపడుతూనే నిషేధం అవసరం లేదని చెప్పింది.మంచి చెడ్డలు నిర్ణయించుకోగల విచక్షణ మన ప్రజానీకానికి వుందన్న విశ్వాసం వ్యక్తం చేసింది. అది నిజమే కావచ్చు గాని ఈ ఉద్వేగ వ్యాపారంలో జరగాల్సిన నష్టం జరిగిపోతుంటుంది. మీడియాపై ప్రభుత్వ నిషేధాలను, ఆంక్షలను ఏనాడూ అనుమతించకూడదు. అదే సమయంలో మీడియా వ్యాపారాత్మక స్వభావాన్ని కూడా విస్మరించకూడదు. దీనిపై ప్రజలలో అంటే ప్రేక్షకులలో చైతన్యం అవగాహన పెంచాల్సిందే. పశ్చిమ దేశాలలో ఇందుకు సంబంధించి అనేక అధ్యయనాలు జరుగుతుంటాయి. హింసాత్మక దృశ్యాలకు వ్యతిరేకంగా పోరాడే పెద్ద సంఘాలే వున్నాయి. 'తెల్లచుక్క' అన్న ఉద్యమం అక్కడ వుంది. అంటే అవాంఛనీయ కార్యక్రమాలకు నిరసనగా ఒకరోజు టీవీ కట్టేస్తారు.అప్పుడు వచ్చేదే వైట్‌డాట్(తెల్లచుక్క) మన దేశంలోనూ మీడియాకు సంబంధించిన అనేక విమర్శలున్నాయి. చర్చలు జరుగుతున్నాయి. ఇవి అనారోగ్యకర పోకడలను నిరుత్సాహ పర్చే వైపు దారితీయాలని ఆశిద్దాం. సున్నితమైన భావోద్వేగాలతో ఆడుకోవడం లాభార్జనా సాధనం కారాదని కోరుకుందాం. ✶

కుటుంబాలపైనే వల

మీడియా కార్యక్రమాలకు పిల్లలే పెద్ద లక్ష్యాలు. ఎందుకంటే వస్తు సంస్కృతి చిన్నప్పటి నుంచే అలవాటు చేస్తే తర్వాత అమ్మకాలు గ్యారంటీ. నెలల పిల్లలు కూడా వ్యాపార ప్రకటనలను గుర్తించగలుగుతారని పరిశోధనల్లో తేల్చారు. పిల్లలను భయపెట్టడం ఆకర్షించడం కూడా తేలిక. తద్వారా కొన్ని తరాల భావి ప్రేక్షక సముదాయం లభిస్తుంది. వాస్తవానికి టీవీ కార్యక్రమాలతో పిల్లలు సున్నితత్వం కోల్పోతున్నారని బాల వైద్యులు హెచ్చరిస్తున్నారు. వారికి హింస, రక్తం అన్నవి సర్వసాధారణమై పోతున్నాయి.దేనికీ చలించని 'పిల్ల రాక్షసుల్లా' తయారవుతున్నారట. టెలి అడిక్షన్ అన్నది పెద్ద వ్యాధిలా మారుతున్నది. గతంలో పిల్లలను భయపెట్టిన దృశ్యాలు ఇప్పుడు వీరిని భయపెట్టడం లేదు. రక్తం చూసి భయపడరు గాని మొహం మీద చిన్న మొటిమను చూసి హడలిపోతున్నారు.శక్తిమాన్‌లా, స్పైడర్ మ్యాన్‌లా వూహించుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నవారూ వున్నారు.ఇక తర్వాత లక్ష్యం స్త్రీలు. స్త్రీలంటే ఆలోచనా శక్తి లేని వారైనట్టు బంగారం లేదా పట్టుచీరలు తప్ప వారికేమీ పట్టదన్నట్టు చేస్తుంటారు. అంతకంటే కూడా - పాశ్చాత్య దేశాలలో వలె డాన్సులు చేయించడం స్టెప్పులు వేయించడం కొన్నిసార్లు భార్య భర్తలను టీవీ తెరపై సరస సల్లాపాలు చేయించడం అలవాటు చేస్తున్నారు. గతంలోని దేశీయ రీతుల్లో గాక సినిమా ఫక్కీకి మరలుస్తున్నారు. పోటీలలో పాల్గొన్నప్పుడు హుందాగా ప్రవర్తించడం గాక కేకలు ఈలలు ఏడుపులు పెడబొబ్బలు పెట్టడం అలవరుస్తున్నారు. ఆనంద బాష్పాలైనా అశ్రు ధారలైనా వాటికవే రావాలి గాని ప్రదర్శన కోసం అన్నప్పుడు అసహజత్వం అనివార్యమవుతుంది.

ఆ అసహజతే సహజత్వమై పోవడం ఇక్కడ మరీ విషాదం.

నవ్వుల్ - పువ్వుల్

కనిపించుట లేదు

శిష్యుడు : స్వామీ! తమ దర్శనం కోసం అవతల భక్తులు పడిగాపులు పడి ఎండలో ఎదురు చూస్తున్నారు. మీరు ఈ ఎసి గదిలో ఏం చేస్తున్నారు?

స్వామి : శిష్యా! నా పొడుగాటి గడ్డం కనిపించుట లేదు. కాస్త వెతికి పెట్టు నాయనా!

ఉదాహరణ

టీచర్ : రామూ పిసినిగొట్టు పనికి ఒక ఉదాహరణ చెప్పు.

రాము : మా నాన్నలా ఒకే సబ్బును సంవత్సరం పాటు వాడడం.

జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

అభిప్రాయం

ఒక కవి ఓ పత్రికా సంపాదకుడికి ఒక కవిత పంపుతూ 'నేనెందుకు బతకాలి' అనే కవితను పంపుతున్నాను. ఒక్క వాక్యంలో మీ అభిప్రాయం రాయండి అని రాశాడు.

సంపాదకుడు ఒక్క వాక్యంలో అభిప్రాయం రాశాడు. 'మమ్మల్ని చంపడానికి'.

ఆనందం

భార్య : నేను హఠాత్తుగా చచ్చిపోతే ఏం చేస్తారు?

భర్త : నేనూ చచ్చిపోతా.

భార్య : ఛ, ఎందుకలా....

భర్త : నాకసలే హార్ట్ ప్రాబ్లమ్ ఉంది కదా, అంత ఆనందాన్ని తట్టుకోవద్దూ.

డెంటిస్ట్

బాస్ : డెంటిస్ట్ దగ్గరికి వెళ్లాలని నిన్న సెలవు పెట్టినట్టున్నావ్ కదూ!

సెక్రటరీ : అవున్సార్!

బాస్: మరైతే ఎవరితోనో సినిమా థియేటర్ నుంచి బయటకు వస్తూ కనిపించావ్!

సెక్రటరీ : అవున్సార్... అతనే మా డెంటిస్ట్.

ఎలా తేవాలి?

"ఏదీ లైసెన్సు చూపించు" కారును వేగంగా నడుపుతున్న అప్పారావును ఆపి అడిగాడు ట్రాఫిక్ ఎస్.ఐ.

"ఏంటి, తమాషాగా వుందా? కారును స్పీడుగా నడుపుతున్నానని నిన్న మీరేగా నా లైసెన్సును తీసుకున్నారు. మళ్లీ అడిగితే నేనెక్కణ్ణించి తేవాలి" అని విరుచుకు పడ్డాడు అప్పారావు.

ఫీజు సంగతి

"డాక్టర్‌గారూ! నాలో ఇంకెవరో ఉన్నట్లు అనుమానంగా ఉందండీ! " చెప్పాడు శంకరయ్య.

"అయితే ముందు నా ఫీజెవరు చెల్లిస్తారో నిర్ణయించుకుని మరీ ట్రీట్‌మెంటుకు రండి.

రక్షణ

"నిన్న నేను షూటింగ్ పూర్తి కాగానే కారులో ఇంటికి వెళ్తుంటే దారిలో దొంగలు అటకాయించి రేప్ చేయబోయారు. కానీ నన్ను నేను రక్షించుకున్నాను" చెప్పింది హీరోయిన్ విలేఖరితో.

"ఎలా?" అడిగాడు విలేఖరి.

"మేకప్ తీశానంతే. దెబ్బతో పారిపోయారు" తాపీగా చెప్పింది హీరోయిన్.

కవిత్వమ్

చీకటి దుఃఖం

- సి.హెచ్.మధు

ఇది చీకటి దుఃఖం
దుఃఖాన్ని వర్ణించటానికి వెలుగు లేదు
ఇది అమావాస్య దుఃఖం
మనసును శరీరాన్ని ఆవహించిన
అమావాస్య ఇది
జీవితాన్ని సమాజాన్ని దేశాన్ని
ఆవహించిన అమావాస్య ఇది
ఇది అగ్రవర్ణ అమావాస్య
ఇది కోటీశ్వరుల అమావాస్య
ఇది అవినీతి అమావాస్య
ఈ అమావాస్యకు రాజకీయ రంగు పులుముకుంది
ఇది దోపిడీ దారుల అమావాస్య
ఇది పాలకవర్గం సృష్టించిన అమావాస్య
ఇది అమావాస్య దుఃఖం
ఇది చీకటి దుఃఖం
కట్నం కోరల కింద ఓ చెల్లి చితాభస్మమవుతుంది
అప్పు కట్టలేని రైతు వురితాడును ముద్దు పెట్టుకుంటాడు
ఓ చేనేత కార్మికుడు చనిపోతూ
దుఃఖాన్ని కౌగిలించుకుంటాడు
డిగ్రీల చదువు మోసానికి ఓ యువకుడు
కారు చీకట్లలో కన్నీరు కారుస్తాడు
వైద్యం అందక ఓ బాలింత విలవిలా కొట్టుకుని ప్రాణం విడుస్తుంది
అవినీతి చట్టాలు కొత్త రోడ్లు
యాక్సిడెంట్లో చనిపోతున్న ప్రాణాల దుఃఖం
ఇది వ్యవస్థ దుఃఖం
వ్యవస్థ చీకటి దుఃఖం
అమావాస్య నిండుకున్న వ్యవస్థ చీకటి దుఃఖం

★

చట్టం తన పని తాను...

అడిగోపుల వెంకటరత్నం

చట్టం తనపని తాను చేసుకుపోతూంది
రహదార్ల వీడి
రాచబాటలు మరిచి
సందుగొందుల్లో
చీకటి దారుల్లో
ఒక చోట తలవంచి
ఒకచోట తల వంపుగా –
నడిచిపోయే చట్టాన్ని చూస్తూ
ఒక చూపు ఆశ్చర్యంగా
ఒక చూపు ఆహ్లాదంగా
ఒక చూపు విషాదంగా
ఒక చూపు ఆవేశంగా–
అభర్భక పై అత్యాచారం
అపరాధి అదృశ్యం
పదవి పలుకుబడి
ఆశ్రిత పక్షపాతం రంగప్రవేశం
దోషి స్థానంలో నిర్దోషి
నిందితుడికి ఛత్రం పట్టి
చట్టం తన పని తాను చేసుకుపోతూంది!
అభాగ్యుడి స్థలం ఆక్రమణ
మిన్ను ముట్టిన రోదనలు వేదనలు
అభ్యర్థనలు ఆక్రందనలు
కదిలిన యంత్రాంగం
ధనపతికి కాపు
చట్టం తనపని తాను చేసుకుపోతూంది!
విద్యాసంస్థలు విద్యను
తులాభారం తూస్తూ
ఫీజులు పిండుతాయి
కరుణించని చట్టాలకు
కన్నవాళ్ల విజ్ఞాపనలు
చదువులు కొనే వ్యవస్థలో
పోటీని బట్టి ఫీజులు
చట్టం తన పని తాను చేసుకుపోతూంది!
చట్టం ఒకరిచేతిలో పనిముట్టు
ఒక చోట నిక్కతిగా
ఒక చోట నిర్లజ్జగా–
ఎప్పుడో ఒకప్పుడు
ఏ ఫిబ్రవరి ఇరవై తొమ్మిదినో
సాఫీగా
సవ్యంగా–

★

క్రైమ్ కథ

తడబాటు

- యర్నాగుల సుధాకరరావు

"**ఈ**రోజు రెండు బస్సులు క్యాన్సిల్ అయ్యాయి.మరో బస్సు వస్తుంది. మీరు అలా కూర్చోండి " రిసెప్షన్‌లో విసుగ్గా చెప్పాడు.

"మైగాడ్! రెండుగంటలు బస్సుకోసం వెయిటింగ్ " అని ఒకింత చిరాకు పడుతూనే సిమెంట్ బెంచిమీద కూర్చుంది స్వప్న. అప్పటికే రెండు మ్యాగజైన్లు కొని కథలు చదివి తిప్పేసింది. ఆమెకు ఎదురుగా ఒక వ్యక్తిని చూసి ఆమెకు తాను కొన్న మ్యాగజైన్‌లో క్రయిమ్‌కథ క్రిమినాలజీ గుర్తుకు వచ్చింది. తప్పు చేసేవాడు తడబడతాడు. తాను పోలీసులకు చిక్కినంత వరకు తడబడుతూనే ఉంటాడు. జైల్లో కూర్చున్నాక ప్రశాంతతలోకి వెళ్లిపోతాడు. అప్పుడు తాను ఎలా బయటపడతానా అనే ఒకే ఒక్క ఆలోచనలో ఉంటాడు. ఆ కథ ఈకాన్సెప్టుతో రాయబడింది. ఆకథలోలా తనకెదురుగా ఒకడు తడబాటుగానే ఉన్నాడు. సెల్‌లో నెంబర్లు పదేపదే కొడుతున్నాడు. ఏ పదోసారో అనుకున్న నెంబర్‌తో మాట్లాడుతున్నాడు. అతడిని పరీక్షగా చూసింది.

నలభైఏళ్లుంటాయి. చల్లని గాలులు వీస్తున్నా చెమటలు పోస్తున్నాయి. చుట్టుపక్కలవారిని అప్పుడప్పుడు చూస్తున్నాడు. రెండు గోనెమూటలు, ఒకసూట్‌కేసు అతడి ముందున్నాయి. పర్సు నిండా డబ్బుంది. ఒకరిద్దరు వచ్చి నోట్లు అందుకుని వెళ్లిపోయారు.

టీకొట్రాడి వద్ద ఒకటీగ్లాసు అందుకుని తాగబోతే చుర్రుమంది. దాన్ని పక్కనే పెట్టాడు.అది చల్లారాక మళ్లీ గుర్తువచ్చినట్టు తీసుకుని కూల్‌డ్రింక్‌లా అయిపోయినా ఊదుకుని తాగడం ఎందుకో నవ్వుపుట్టించి నవ్వుకుంది స్వప్న. అంతలోనే ఆమె బస్సు వచ్చింది. హమ్మయ్య అనుకుని బస్సులో ఫ్రంట్‌సీటులో కూర్చుంది. మళ్లీ ఎదురుగా అపరిచితుని తడబాటు దృశ్యం కంటిన్యూ అవుతోంది. అతడిముందు గోనెమూటలను ఒకకుక్క వాసనచూస్తుంటే దాన్ని అదలిస్తున్నా అది కదలడంలేదు.

స్వప్న అనుమానంగా చూసింది.సరిగ్గా అప్పుడే అపరిచితుడు తన పక్కనుంచి వెడుతున్న రైతుచేతిలో కర్ర అందుకుని కుక్కను చచ్చేలా నడుం మీదకొట్టాడు. అదిలిస్తే సరిపోయే దానికి అంతగా చావగొట్టాడు. ఇంతకూ ఆగోనెసంచిలో ఏముంది? ఈలోగా బస్సు కదిలింది. అక్కడ గోడమీద 'దొంగలున్నారు జాగ్రత్త' అన్న బోర్డు చూసింది. పోలీసులకు అనుమానితుల ఆచూకీ తెలపండి. సెల్‌నెంబర్లున్నాయి. ఆత్రంగా చదివి నెంబర్ నోట్ చేసుకుంది. బస్సు స్పీడుగా పోతోంది.సెల్‌లో ఆనెంబర్ ఫీడ్‌చేసి రింగ్‌చేసింది. ఎందుకో గుండెలు కొట్టుకోసాగాయి. లోగొంతుతో "సార్" అంది.

"చెప్పమ్మా! నేను టూటవున్ ఇన్‌స్పెక్టర్‌ని"

"సార్ నాఅనుమానం మాత్రమే. అతడెవరో తెలియదు. బస్టాండ్‌లో నలభైఏళ్లవాడు తీవ్రంగా తడబడుతున్నాడు. మీరు ఎలాగూ వాడిని పట్టు కుంటారు. అతడు నేరగాడైతే నాసెల్‌కు తెలియపరచండి. ఎందుకంటే నాఅనుమానం కరెక్టా కాదా అనేది తేలిపోతుంది" అనిమరిన్ని వివరాలు అందించేసి సెల్ ఆపేసింది. బస్సు ప్రయాణంలో రెండుగంటలు గడిచిపోయాయి.స్వప్న మరి రెండుగంటలు ఆబస్సులో ఉండాలి. తాను పోలీసులకు ఏదో ఉప్పు అందించింది. నిజంగా ఆగోనెమూటలో ఏశవమైనా ఉందేమో, లేకుంటే ఏవైనా తినుబండారాలుంటే కుక్క కక్కుర్తిపడి ఉంటుంది. ఆపిచ్చివెధవ అనవసరంగా తనముందు అనేక సార్లు తడబడ్డాడు. ఏదిఏమైనా నేను లిమిట్సు దాటాను. ఎందుకు పోలీసులతో చెప్పాను. వారు సెల్‌నెంబరును ట్రేస్ చేసుకుని వచ్చినా వచ్చేస్తారు" ఆలోచిస్తూ భయపడింది.

స్వప్న బస్సులో పరిపరి విధాలుగా ఆలోచిస్తూనే ఉంది. ఆమెకు తెలియకుండానే బస్సు గమ్యం చేరుకుంది. కిందకిదిగి రాత్రి 9గంటలైనందున రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. నడుస్తుండగా సెల్ మోగింది. కాలర్‌లో చూస్తే ఇన్‌స్పెక్టర్ నెంబర్. గతుక్కుమంది. ఏమిచేయాలో తెలియలేదు. ఫోన్ రింగవుతూనే ఉంది. ఆన్‌చేసి చెవికి అదుముకుంది. ఆమె గుండెలు చల్లగా అయిపోయాయి.

"మీరు ఊహించిందే కరక్టు. వాడు పెద్ద నేరగాడు. భార్యను నరికేసి రెండు గోనెసంచులకు సర్దాడు. కొండప్రాంతంలో బస్సులోవెళ్లి అక్కడ దిగిపోయి ఆమూటల్ని లోయల్లోకి విసిరేసి వచ్చేద్దామని బస్సుకోసం చూస్తున్నాడు. మీదృష్టిలో పడ్డాడు. మీరు మాకు చెప్పారు. నేను వెళ్తే నన్ను చూసి పారిపోబోతే పట్టుకున్నాను. ఇంతవరకు ఇంటరాగేషన్ అయ్యింది. వాడు భార్యను చంపింది ఎందుకో తెలిస్తే చాలా ఆశ్చర్యపోతారు. ఈమధ్య ప్రేమలో పడ్డాడు. అందుకు భార్య అడ్డని ఈపనిచేసాడు. తీరా వీడు భార్యను చంపలేకపోయాడు. ఇద్దరి సాయంతో ఆపనిచేసాడు. వారిని అదుపులోకి తీసుకున్నాం. మీరు క్లూ అందించినందుకు చాలా ఆనందిస్తున్నాం. మీరు పోలీసులకు చెప్పినట్లు ప్రథమసాక్షిగా కోర్టుకు రావాల్సిఉంటుంది. మీపేరు, అడ్రసు చెప్పండి నోట్‌చేసుకుంటాను" గుక్క తిప్పుకుండా అడిగాడు.

"అందుకే పోలీసులకు చూసింది చెప్పడానికి ఎవరైనా వెనకాడతారు. నేను ప్రాణం పోయినా నాఅడ్రసు చెప్పను."

"మీసెల్‌నెంబర్ నావద్ద ఉంది. మీరెవరో తెలుసుకోవడం చాలా తేలిక. అసలు మీకూ నిందితుడికి ఏమైనా పేచీలున్నాయా? అందుకే మాకు సమాచారం అందించారు. అవునా?"

"ప్లీజ్ స్టాపిట్. చాలా తప్పు చేశాను. మీరు నా సెల్‌నెంబర్ ద్వారా పట్టుకోలేరు. ఎందుకంటే నేను సిమ్ రికార్డెడ్‌గా కొనలేదు. ఇప్పుడే సిమ్ కాలవలో పడేస్తాను" అని కోపంగా చెప్పి రోడ్డుమీద ఎవరైనా చూస్తున్నారేమోనని చూసింది. ఒకరిద్దరు చూసుకుంటూ వెళ్లిపోతున్నారు.

"మీరు జయపూర్ బస్సు ఎక్కారు. సన్నగా పొడుగ్గా ఉంటారు. మీరు ఫ్రంట్‌సీటులో కూర్చున్నారు. ఎక్కడ దిగింది రేపు బస్సు కండక్టర్ ద్వారా కూపీ లాగేస్తాం. అనవసరంగా సిమ్ పారేయకండి. సో మహిళగా చాలా ధైర్యంతో మీరు ఒక హంతకుడిని పట్టిచ్చారు. అదే ధైర్యంతో రేపు కోర్టు బోనులో నిలబడి చూసింది చెప్పండి. ఇందులో భయం దేనికి?"

సెల్ ఆపేసి బ్యాగ్‌లో పడేసుకుని ఇంటిముందుకు వెళ్లి కళ్లు తిరుగుతున్నట్టుగా తూలిపోతూ నడుస్తూనే సోఫాలో కూర్చుని "అమ్మా నీళ్లివ్వు" పెద్దగా అరిచింది. తల్లి నీళ్ల ఇచ్చింది. గటగటా తాగేసి బ్యాగ్‌లోంచి సెల్‌తీసి అందులోంచి సిమ్ తీసి వేరే సిమ్ వేయాలనుకుని మళ్లీ మొదటి సిమ్ వేసుకుని హమ్మయ్య అని గుండెలమీద చెయ్యివేసుకుంది. సెల్ రింగ్ అయ్యింది.

కాలర్‌లో ఇన్‌స్పెక్టర్ అనిచూసి "ఏమిటి నాకేమైనా పిచ్చా? సిమ్ మార్చానే" అని బ్యాగ్‌లో సిమ్‌నుతీసి చూసుకుంది.

"ఏయ్ నీకేమైందే ఏమిటా తడబాటు? నువ్వు సిమ్ మార్చాలనుకున్నావు. కానీ పాతదే వేసుకున్నావు. ఎందుకు తడబడుతున్నావు" తల్లి అడిగింది పక్కనే కూర్చుని తల నిమురుతూ .

"అయ్యో నేనెందుకు తడబడుతున్నాను?" అని అదోలా నవ్వుకుంది.

★

కథ

ఆయా

తమిళమూలం : శివశంకరి

స్వేచ్ఛానువాదం : సిహెచ్. శ్రీనివాసమూర్తి

సమయం సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటలు. అపరాహ్న సూర్యుడు మండిపోతున్నాడు. వంటింటి గుమ్మం ఇవతల విశ్రాంతి తీసుకుంటున్న వడియమ్మాల్ మెడమీద పట్టిన చెమట చికాకు పరుస్తోంది. పక్కనే వుంచుకున్న తాటాకు విసనకర్రతో నాలుగైదు సార్లు విసురుకుంది. చెయ్యి నొప్పి పుట్టడంతో విసనకర్రను పక్కన పడేసి చీరకొంగుతో మెడంతా తుడుచుకుంది. నిద్రపోవాలన్నా ఆమెకు నిద్రపట్టడం లేదు. లేచి కూర్చుంది కానీ వెంటనే తల తిరిగినట్లనిపించింది. వయసుడిగిన కొద్దీ ఆమె రక్తం ఒడిదుడుకులకు లోనవుతోంది పక్షేదో గుండెలో ప్రవేశించి బలంగా రెక్కలాడిస్తున్నట్లు ఆమె ఛాతీలో ఎడమవైపు నొప్పి ప్రారంభమైంది. మెల్లగా లేచి వంటింట్లోకి నడిచి ఫిల్టర్‌లో కాఫీ పొడి వేసి, పైన వేడినీళ్ళ పోసి మూత బిగించింది. గాలి వీస్తున్న ఇంటి వెనుక భాగానికి వెళ్లి తులసికోట పక్కగా కాళ్లు బారజాపి కూర్చుంది. డికాక్షన్ ఫిల్టర్ అయ్యేదాకా అలాగే కూర్చుంది. మెల్లిగా వీస్తున్న గాలి కొద్దిగా వేడిగా తాకింది. వెలుగుతున్న సూర్యుణ్ణి చూస్తున్న ఆమె కళ్లు అకస్మాత్తుగా చికిలించాయి. ఒక కాకి ఎండవేడిని భరించలేక, బావిగుంటలో నీళ్లుతాగి, ముక్కు తెరిచి, మెడ సాగదీసి పక్కనేవున్న జామచెట్టు కొమ్మల్లో దూరి నలుమూలలా చూడసాగింది. పుష్కలంగా పండి వేలాడుతున్న జామ చెట్టుకేసి చూసిందామె.

'దీనికి ఎంత వయసుండొచ్చు? ఇరవై కంటే ఎక్కువుండవు. అవును అంతే అయివుండాలి.

అప్పటికి మోహన్ ఇంకా చిన్న పిల్లాడు. ఆమె భర్త ఎవరో స్నేహితుడిచ్చాడని ఆ జామ మొక్కని తెచ్చి నాటాడు. మోహన్‌కు పదేళ్లు వచ్చేసరికి ఆ జామచెట్టు పెద్దదై శాఖోపశాఖలుగా విస్తరించి మధుర ఫలాలను అందించడం ప్రారంభించింది. అదృష్టమనుకోవాలి. ఆ చెట్టుపండ్లు తొడిమవైపు లావుగా వుండి పోనుపోను సన్నగా వుండేవి. నిమ్మకాయ సైజులో నిగనిగలాడుతుండేవి. కోసి చూస్తే లోపల ఎర్రగా, విత్తనాలు ఎక్కువగా లేకుండా తీయగా వుండి నోట్లో పెట్టుకుంటే పంచదారలా కరిగిపోయేవి. మోహన్ చిన్నతనమంతా ఆ చెట్టు కొమమ్మల్లోనే గడిచింది. స్కూల్ సెలవుల్లో మోహన్, అతని స్నేహితులు చేసే అల్లరికి హద్దుండేది కాదు. ఇప్పుడు ఆ మోహనే పెరిగి పెద్దవాడై పెళ్లి చేసుకుని మూడు నెలల బిడ్డకి తండ్రయ్యాడు. మొదట భర్త, తర్వాత కొడుకు మోహన్ జ్ఞాపకాలు మనసులో మెదిలి ఆమె కనుకొలనుల్లో నీళ్ల నిలిచాయి. మహరాజులా జీవితం గడిపిన భర్త ఒక్క నిమిషంలో శాశ్వతంగా కనుమరుగై పోయాడు. తనుమాత్రం జీవచ్ఛవంలా ఇలా....

అక్టోబర్ వస్తే ఆమె భర్తపోయి మూడు సంవత్సరాలు నిండుతాయి. భర్త గుర్తుకురాగానే ఆమె గుండెల్లో బాధ తొంగిచూసింది. తులసికోటకు వీపునానించి, కొద్దిసేపు కళ్లు మూసుకుంది. భర్త పోయాడు, వున్న ఒక్కగానొక్క కొడుకు ఎక్కడో దూరంగా ఉత్తర భారతంలో ఉన్నాడు. తను మాత్రం అనాథగా, నా అనేవాళ్లెవరూ లేని జీవితాన్ని గడుపుతోంది. ఊహించిన కొద్దీ అశ్రువులు బొట్లు బొట్లుగా ముడతలు పడిన ఆమె చెక్కిళ్ల మీదికి జారాయి.

వడియమ్మాల్‌కు ప్రస్తుతం యాభైతొమ్మిది సంవత్సరాలు. పన్నెండు సంవత్సరాల ప్రాయంలోనే ఆమె నూతన వధువుగా ఆ ఇంట్లో అడుగుపెట్టింది. భర్త నటేశన్ బతికున్నంత కాలం ఆమె కూడా ఆనందంగానే గడిపింది. చిన్న పిల్లలా తన ప్రపంచం తప్ప మరో ప్రపంచం తెలియదు. ఇల్లు, వంట, భర్త, కొడుకు, ఇంటిచుట్టూ వున్న తోట... ఇదే తనకు తెలిసిన ప్రపంచం.

నటేశన్‌కు పదెకరాల పొలముంది. పంటలు పుష్కలంగా పండేవి. అవసరాలకు గరిసెలలో నింపిన తర్వాత, తతిమ్మా ధాన్యాన్ని అమ్మేవాడు. సంవత్సరం పొడుగునా అవసరమైనవన్నీ అమర్చిపెట్టేవాడు. మిగిలిన డబ్బుతో తనకు బంగారు ఆభరణాలు చేయించేవాడు. కొడుకు భవిష్యత్తు కోసం జీవితబీమా చేయించాడు. వాడిపేరుతో బ్యాంకులో డబ్బు దాచేవాడు. ఒక్కడే కొడుకు కావడంతో వాడి జీవితానికి ఏలోటూ రాకుండా చూసుకున్నాడు.

వడియమ్మాల్ తన కొడుకు గురించి తప్పుడు అంచనా వేసుకుంది. తల్లిదండ్రులకు విధేయుడిగా వుండి, తండ్రిని అనుసరిస్తాడని ఆశించింది. కానీ అనుకున్నట్లు జరగలేదు. పై చదువులు చదివి ఇంజనీరైన తనకి ఈ వూరు పరిసరాలు నచ్చలేదని మొఖంమీదే చెప్పేశాడు. ముంబాయి వెళ్లి ఉద్యోగంలో చేరిపోయాడు. ఇదంతా అయిదు సంవత్సరాల నాటి మాట.

ఎవరైనా కొడుకు గురించి అడిగితే "పోనీ! ఇక్కడ వుండలేని మనిషిని బలవంతంగా వుంచలేము కదా. పైగా పెద్ద చదువులు చదువుకున్నవాడాయె" అనేవాడు నటేశన్. కానీ ఆమెకు తెలుసు. ఆయన లోలోపల పడిన బాధ. ఏదేమైనా జరగాల్సిందేదో జరిగిపోయింది.

మోహన్‌కు మంచి సంబంధం చూసి పెళ్లి చేసి మనవడూ, మనవరాళ్లతో తక్కిన జీవితం గడపాలని కోరిక. కానీ అదికూడా అడియాశగానే మిగిలింది. పెళ్లి సంబంధాల గురించి వాళ్లు రాసిన ఉత్తరాలకు మోహన్ నుండి ఒక్కదానికి కూడా జవాబు రాలేదు. ఒకసారి సెలవులకు ఇంటికొచ్చిన మోహన్‌ను ఇద్దరూ నిలదీశారు. అప్పుడు కానీ అసలు విషయం బయట పడలేదు. అతనికి ఉష అనే ముంబాయి పిల్ల నచ్చిందట. చదువుకున్నది, అందగత్తె, పైగా ఉద్యోగం కూడా చేస్తోంది. అన్ని రకాల ఆధునికతను సంతరించుకున్న అమ్మాయి. కానీ కులంగాని పిల్ల. అమ్మానాన్నలు ఎంత చెప్పినా మోహన్ ససేమిరా అనేశాడు. నటేశన్, వడియమ్మాల్ ఇద్దరూ హతాశులైనారు. రెండు రోజులపాటు రకరకాల ప్రయత్నాలు చేశారు. కానీ మోహన్ దేనికీ లొంగలేదు. అతని మొండితనం ముందు శక్తిహీనులై నిల్చుండిపోయారు. వారిద్దరి హృదయాలకు ఊహించని గాయాలయ్యాయి. మూడోరోజు వడియమ్మాల్ భర్త కాళ్లమీద పడి బతిమాలింది. చెక్కిళ్లమీద కన్నీళ్లు ధారాపాతంగా కారుతుండగా ఒంటరిగా ఉన్న సమయంలో "వాణ్ణి వాడి ఇష్టాయిష్టాలకు వదిలేయండి. మనం వొప్పుకోకుండా వాడు వెళ్లిపోతే కనీస ఆప్యాయతలు కూడా కరువైపోతాయి" అని మొరపెట్టుకుంది. ఆమె చెప్పిన విషయం అతనికి అర్థమైంది. మరుసటి రోజు ఉదయాన్నే కొడుకుని పిలిచి ఎటో చూస్తూ "నీ యిష్ట ప్రకారమే చెయ్యి" అన్నాడు.

పెళ్లి ముంబాయిలో జరిగింది. ఊళ్లో జనమంతా గుసగుసలాడుకున్నారు.

ఎవరో కొత్తవాళ్లలా ఆ తల్లిదండ్రులిద్దరూ పెళ్లికి ఒకరోజుముందు వెళ్లి పెళ్లైన మరునాడే రావడం అందర్నీ ఆశ్చర్యపర్చింది.

"వాడే నా కొడుకైతేనా కాళ్లిరగ్గొట్టేవాణ్ణి" అన్నారొకరు.

"నేనైతేనా ఇంటినుండి కుక్కను తరిమేసినట్టు తరిమేసేవాణ్ణి" అన్నారింకొకరు.

"ఏందిది వడియమ్మా! నువ్వు ఎందుకొప్పుకొన్నావ్?" మరొకరు నేరుగా అడిగారు. రకరకాల ప్రశ్నలు, రకరకాల విసుర్లు.

వడియమ్మాల్, నటేశన్లు పెదవి విప్పలేదు. అందరిముందు మూగవాళ్లలా నిల్చున్నారు. కానీ ఏకాంతంలో భోరుమని ఏడ్చేవారు. నటేశన్‌కు చెప్పా పెట్టకుండా వచ్చిన గుండెనొప్పి యమధర్మరాజు ఆగమనానికి సూచనగా అనిపించింది. అప్పటికి కొడుకు పెళ్లై నాలుగంటే నాలుగే నెలలు గడిచాయి. తలనొప్పిగా వుందని చెప్పి పడుకున్నాడు. తరువాత ఛాతీలో నొప్పిగా వుందని చెప్పాడు. ఏవో మందులు తెచ్చేలోగానే నటేశన్ కన్నుమూశాడు.

టెలిగ్రాం అందిన మరుసటి రోజే వచ్చాడు మోహన్ భార్యతో సహా. చేయాల్సిన శ్రార్ధ కర్మలతో పాటు మరేవో పనులు చక్కబెట్టుకోవడానికి వచ్చినట్టున్నాడు. ఆమె ఎంత మొత్తుకున్నా వినకుండా ఎనిమిదెకరాల భూమిని అమ్మేశాడు. ఇప్పుడంత అర్జంటుగా అమ్మేయాల్సిన అవసరమేమొచ్చిందని నిలదీసినా మాటామంతీ లేకుండా ఎద్దులను కూడా అయినకాడికి తెగనమ్మేశాడు. ఊరిపెద్దలు అడిగితే "నేను ముంబాయిలో వుంటాను. ఎప్పుడంటే అప్పుడు రావడానికి నాకు వీలుపడదు. నా బాధ్యతలు నేను నిర్వర్తించాలి కదా. అమ్మను కూడా నాతోనే తీసుకెళ్తాను" అని సమాధానమిచ్చాడు. అన్నట్లుగానే ఆమెను కూడా ముంబాయికి తీసుకెళ్లాడు.

తనవూళ్లో విశాలమైన పెరడు, అందమైన తోట, పలకరించే జనం... ఇవన్నీ అనుభవించిన వడియమ్మాల్‌కు నగరజీవితం కష్టంగా అనిపించింది. ఒక పల్లెటూరు మనిషిని ఇంట్లో పెట్టుకుని నిభాయించడం మోహన్, ఉషలకు అంతకంటే కష్టమయింది. కిందకూర్చొనే ఆమె భోజనం చేస్తుంది. భోజనం తర్వాత పెద్దగా తేన్పుతుంది. ఇంటికెవరొచ్చినా లోపలికి పిలిచి అందరిముందూ మాట్లాడుతుంది. రెండు నెలలు తిరక్కుండానే ఆమె పల్లెటూరి అలవాట్లు కొడుకూ, కోడలికి చికాకు కల్గించాయి. ఆరు నెలల్లో అవి పెరిగి కోపతాపాలకు దారితీసింది. పగలల్లా ఆఫీసుల్లో అలసిపోయి వచ్చిన వాళ్లకు ఏకాంతం కరువైంది. సెకండ్‌షో సినిమాలకు కానీ, ఫ్రెండ్స్ ఇళ్లల్లో పార్టీలకు వెళ్లాలన్నా కష్టమైపోయింది. "నేనొక్కదాన్ని వుండాలంటే రాత్రిపూట భయంరా" అనేది వడియమ్మాల్. వంట చేసేటప్పుడు టైల్స్ అన్నీ ఖరాబు చేసేది. పెద్దగా మాట్లాడడం ఆమెకు అలవాటు. ఇవన్నీ ఆ దంపతులకు సహింపరానివిగా మారాయి. ఏడు నెలల తర్వాత మోహన్ చాలా తెలివిగా ఆమెతో "నీకు ఈ నగర వాతావరణం పడడంలేదల్లే వుంది. నువ్వు వచ్చిన దగ్గర్నుండీ తలనొప్పి, మోకాళ్లనొప్పులంటూ బాధపడుతున్నావు. ఇక్కడి భాష నీకు తెలియకపోవడం వల్ల, నువ్వు ఎవరితో మాట్లాడానికి వీలు లేకుండా పోయింది. ఎప్పుడైనా గుడికి కూడా పోలేకపోతున్నావు. అందుకని నేను చెప్పేదేమిటంటే నువ్వు మళ్లీ మనూరికే పోవడం మంచిదనిపిస్తోంది. మేమూ అప్పుడప్పుడు వచ్చి చూస్తుంటాం. నీకు మాత్రం ఇది మంచిదనిపించడం లేదా?" అని నచ్చజెప్పాడు. అతని మాటల వెనక ఉన్న అంతరార్థం వడియమ్మాల్‌కు అర్థమైపోయింది. మరోమాట మాట్లాడకుండా మూటాముల్లె సర్దుకుని తనవూరికొచ్చేసింది.

"తిరిగొచ్చావేంటి?" అని అడిగిన వాళ్లందరికి ఏవేవో కారణాలు చెప్పింది. అక్కడ తనకు బాగాలేదని, విపరీతమైన రద్దీ అనీ, పలకరించేవాళ్లు పురుగైనా వుండరనీ, మాట్లాడదామంటే భాష అర్థంకాక చాలా చికాకేసిందనీ... ఏవేవో సమాధానాలు చెప్పింది. ఇదంతా జరిగి దాదాపు రెండున్నర సంవత్సరాలు అయింది. మధ్యలో ఒకేఒకసారి మోహన్ వచ్చి రెండ్రోజులుండి వెళ్లాడు. ఉషకు కాన్పయింది. మనవడు పుట్టాడు. ఆ బిడ్డకి ఇప్పుడు మూడు నెలలు. కానీ వారిద్దరూ ఇంతవరకు వచ్చిన పాపాన పోలేదు 'వాళ్లకి రావడం ఇష్టం లేకపోతే పోనీ కనీసం మనవణ్ణైనా ఒక్కసారి తనకి చూపించొచ్చు కదా' అని అనుకునేది మనసులోనే.

గత స్మృతులతో బాధగా లేచి వంటగదిలోకి నడిచింది వడియమ్మాల్. కాఫీ కలుపుకొని గటగటా తాగేసింది. కాఫీ రుచిగా వుందోలేదో అన్న ధ్యాస కూడా లేదు. మళ్లా పెరట్లో కెళ్లి కూర్చుంది.

భగవంతుడు ఆమె వేదనను అర్థం చేసుకున్నట్లు మరుసటిరోజే మోహన్ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.

"నువ్వు అక్కడ ఒక్కదానివే వుండడం నాకు బాధగా వుంది. నేను నాలుగో తేదీన వస్తున్నాను. నాతోపాటు ముంబాయి రావటానికి సిద్ధంగా వుండు" ఇదీ ఆ ఉత్తరం సారాంశం. నాలుగే నాలుగు వాక్యాలు.

వడియమ్మాల్ ఆనందానికి అవధుల్లేవు. చల్లని పాలతో స్నానం చేసినట్లనిపించింది. ఉత్తరం చేతిలో పట్టుకునే ఇరుగుపొరుగు అమ్మలక్కలందరికీ పనిమాలా వెళ్లి పలకరించింది. "మీరంతా మా మోహన్ గురించి ఏవేవో మాటలన్నారు. తల్లిని సాకే మనిషి కాదన్నారు. నన్ను వెళ్లగొట్టాడని నిందలేశారు. ఇప్పుడేమంటారు?" అంటూ ఉత్తరం చూపించి అందర్నీ దులిపినంత పనిచేసింది.

నాలుగో తేదీకి ముందుగానే వడియమ్మాల్ తెగ తొందర పడిపోయింది. తన సామాన్లన్నీ జాగ్రత్తగా సర్దుకుంది. ఇడ్లీరవ్వ, ఉప్పుడు రవ్వ, రకరకాల పిండివంటలు, ఊరగాయలు, వడియాలు, అప్పడాలు మూటలు కట్టింది తీసుకెళ్లడానికి.

అనుకున్నరోజు రానేవచ్చాడు మోహన్. తల్లిని తనతో తీసుకువెళ్తుంటే వడియమ్మాల్ ముఖం చిరునవ్వులు చిందించింది. ముంబాయి చేరిన వెంటనే ముందుగా మనవణ్ణి చూసుకుంది. సన్నగా, బక్కగా వున్నాడు. ఇల్లంతా చిందర వందరగా వుంది. ఉష పనిచేసే ఆఫీసు యజమాని చాలా స్ట్రిక్ట్. డెలివరీ తర్వాత సరిగ్గా నలభై అయిదు రోజులు మాత్రమే మెటర్నటీ సెలవులు ఇచ్చాడు. అందుకనే ప్రసవం తర్వాత నలభై అయిదు రోజుల నుండే ఆఫీసుకు వెళ్లక తప్పింది కాదు కోడలికి. కొడుకూ కోడలూ ఆఫీసుకి వెళ్లగానే పిల్లాడికి నీళ్లుపోసి, పాలు పట్టి, ఉయ్యాల్లో వేసి జోలపాడి నిద్రపుచ్చింది. ఇల్లంతా ఊడ్చి, తుడిచి శుభ్రంగా వుంచింది. ఇంటిపనీ, బట్టల పనీ, వంటపనీ అంతా అయిన తర్వాత తను భోజనం చేసింది. ఇవన్నీ అయ్యేప్పటికి సుమారు మధ్యాహ్నం మూడు గంటలయింది. ఇక అప్పుడు కాస్త విశ్రాంతిగా కాళ్లు బార్ల చాపి కూర్చుంది.

ఆ సమయంలోనే కాలింగ్‌బెల్ మోగేసరికి వడియమ్మాల్ తలుపుతీసి చూసింది. ఎదురు ఫ్లాట్‌లో వుంటున్నావిడ. వడియమ్మాల్ మొదటిసారి వచ్చినప్పుడు పరిచయమైంది. ఆమెని లోపలికి రమ్మని ఆహ్వానించింది.

"ఎలా వున్నారాంటీ? నిన్న రాత్రి వచ్చినట్లున్నారు. రైలు ప్రయాణంలో అలసిపోయుంటారు. ఉదయం వద్దామనుకున్నా కానీ, అసలే ప్రయాణపు బడలికతో ఉన్న మీకు అసౌకర్యం కల్గించడమెందుకని రాలేదు" అంటూ ఇల్లంతా కలియజూసింది.

"ఇప్పుడు ఇల్లు యిల్లులా వుంది. ఇక ఉషకు ఇబ్బందేమీ వుండదు. రెండు నెలల్నుండి సాయం చేసేవాళ్లు లేక నానా తంటాలు పడింది పాపం. ఇల్లు, వంట, పిల్లాడు, ఆఫీసు... అంటూ నిజంగా నరకం అనుభవించింది. పిల్లాడిని ఎవరి దగ్గరైనా వుంచిపోవడం ఆమెకు ఇష్టం లేదు. ఈ మహానగరంలో ఎవరినైనా ఆయాగా పెట్టుకుందామంటే, అమ్మానాన్నలు అటుపోగానే పిల్లలకి నిద్రమాత్రలు మింగించి వాళ్ల బయటికెళ్లి బలాదూర్ తిరుగుతుంటారు. అందుకనే ఉష ఎవ్వరినీ నమ్మదు. తన తల్లిని తెచ్చి పెట్టుకుందామంటే ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగానే వుందట. అత్తగారిని పిలిపించుకుంటే బాగుంటుంది కదా అంది. నేను కూడా అదే చెప్పాను. వెంటనే మిమ్మల్ని రమ్మని.... " ఇలా వచ్చినామె తన ధోరణిలో తను చెప్పుకుపోతోంది.

ఇదంతా వినగానే వడియమ్మాల్‌కు ఎక్కడో ముల్లు గుచ్చుకున్నట్లనిపించింది. తను ఒంటరిగా ఆ పల్లెటూర్లో బిక్కుబిక్కుమంటూ బతుకునీడుస్తున్నాననే జాలి కూడా కాదన్నమాట. ఆఘమేఘాలమీద తనని తీసుకురావడం, తమ దగ్గరే వుండాలని ఆప్యాయత ఒలకబోయడం... కేవలం వాళ్లకొక ఆయా అవసరం. కనుకనే వీళ్లకు నేను జ్ఞాపకమొచ్చాను.

కళ్లలో పెల్లుబుకుతున్న ఉప్పెనను బలవంతంగా ఆపుకుంటూ "అలా కుర్చీలో కూర్చోండి. నిలబడే మాట్లాడుతున్నారు" అంది. ఆ మాటలంటుంటే ఆమె గొంతు జీరబోయింది.

★

సాహసం... సరదాల సమ్మిళితం
బంగీజంప్



మీరెప్పుడైనా ఈత కొట్టారా? బావి పైకప్పు నుంచో, ఈత కొలను పైనుంచో, కాలువ గట్టు నుంచో దూకేవారా..ఓ సారి గుర్తు తెచ్చుకోండి..అందులో ఎంత మజా ఉంటుంది? అలా నీటిలోకి దూకడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది కదూ. పది పదిహేను అడుగుల ఎత్తు నుంచి దూకితేనే అంత మజా అనిపిస్తే క్షణాల్లో 120 నుంచి 700 అడుగుల పైనుంచి స్వేచ్ఛగా దుమికేసి..నింగీ, నేల మధ్యలో..లోలోన తెలియని భయం..పైకి సాహసం చేశామన్న గర్వం..మనసు పొరల్లో ఎక్కడో ఓ సరదా సందడి చేస్తుంటే ఇంకెంత మజాగా ఉంటుందీ...వాహ్ అద్భుతమనిపిస్తోంది కదూ.. ఆ సాహసం, భయం, సరదాల సమ్మిళిత రూపమే బంగీజంప్.

- అమర్

ఎత్తైన భవనాలు, వంతెనలు వంటి స్థిర నిర్మాణాల పైభాగాన్ని ఆధారంగా చేసుకొని బంగీజంప్ చేస్తారు. క్రేన్లు, వేడి బెలూన్లు, హెలీకాప్టర్ల వంటి వాటి నుంచి కూడా ఈ జంప్ చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. బంగీజంప్‌లో రెండు విషయాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఒకటి దూకే ప్రదేశం, రెండు తాడు. తాడును సాగే ధర్మం ఉండే ఎలాస్టిక్, లేటెక్స్ (జిగుర్లు) వంటి వాటితో రూపొందిస్తారు. దూకే వ్యక్తి కాళ్ల మడమలకు ఈ తాడు కడతారు. చేతులు, నడుం భాగానికి రక్షణగా పట్టీలు (బెల్ట్స్) బిగిస్తారు. వీటి సాయంతో పైభాగం నుంచి దుమికేసి గాలిలో పైకి కిందకు, కిందకు పైకి ఊగిసలాడుతూ సరికొత్త అనుభూతిని ఆస్వాదిస్తాడు. తాడులో సాగుదల సామర్థ్యం సమాంతరంగా విస్తరించే వరకూ ఇలా ఊగిసలాట కొనసాగుతుంది.

పుట్టిందిలా...

బంగీజంప్‌కు మూలాలు న్యూజిలాండ్‌లో ఉన్నాయి. కివీస్ పరిభాషలో బంగీ అంటే 'సాగే తాడు' అనే అర్థం. జేమ్స్ జెన్నింగ్స్ అనే ఆయన 1825లో తాను రాసిన 'అబ్జర్వేషన్స్ ఆఫ్ సమ్ ఆఫ్ డయలెక్ట్స్ ఇన్ ది వెస్ట్ ఆఫ్ ఇంగ్లండ్' అనే పుస్తకంలో బంగీ పదాన్ని తొలిసారిగా ప్రస్తావించారు. ఇరవయ్యవ శతాబ్ది 30వ దశకంలో ఈ నిర్వచనాన్ని రబ్బరుకు వర్తింపచేశారు. వస్త్రం, రబ్బరుతో చేసిన తాళ్లకు చివర్లలో కొక్కాలు అమర్చి బంగీ తాళ్ల పేరుతో క్వీన్స్‌లాండ్ కొన్ని దశాబ్దాలుగా విక్రయిస్తున్నారు. దక్షిణ పసిఫిక్ సముద్ర తీరంలో పెంటికోస్ట్‌లోని యువకులు కాళ్లకు చెట్ల ఊడలను, తీగలను కాళ్ల మడమలకు కట్టుకొని ఎత్తైన ప్రదేశాల నుంచి కిందకు దూకుతూ సాహసాన్ని ప్రదర్శించేవారు. 'ల్యాండ్ డైవర్స్' అని పిలవబడే ఈ సాహసికులపై అదే పేరుతో 1950లో బిబిసి ఓ ఆసక్తికర కథనాన్ని వెలువరించి ఓ సరికొత్త ప్రక్రియను ప్రపంచం ముందుంచింది. ఇదే తరహాలో మెక్సికోలో పాపన్‌ట్లా నృత్యం ప్రసిద్ధి చెందింది. పొడవాటి స్థంభానికి పైభాగంలో ఓ చట్రాన్ని అమర్చి, దానికి నలువైపులా తాళ్లతో వేళ్లాడుతూ చేసే చిత్రమైన భంగిమల ద్వారా పాపన్‌ట్లాలు (Papantla) సాహసాన్ని ప్రదర్శిస్తారు. 1892-93లో చికాగోలో జరిగిన ఓ ప్రపంచోత్సవంలో ఆధునిక బంగీ తరహాలో ఓ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నాలుగు వేల అడుగుల ఎత్తైన నిర్మాణానికి అత్యంత దృఢమైన రబ్బరు తాళ్లకు ఓ వాహనాన్ని వేలాడదీసి కిందకు వదిలేసే ఏర్పాటు చేశారు. ఈ వాహనంలో రెండు వందల సీట్లు ఉండేవి. రక్షణ కోసం నేలపై మెత్తని పరుపు లాంటి ఏర్పాటు చేయాలని కూడా భావించారు. అయితే ఈ ప్రక్రియకు నిర్వాహకులు అనుమతించకపోవడంతో కార్యరూపం దాల్చలేదు.

అరెస్టుతో మొదలైన ఆధునిక జంప్

ఆధునిక బంగీజంప్‌ను ప్రపంచంలోనే తొలిసారిగా చేసిన ఘనత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ డేంజర్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు డేవిడ్ కిర్కే, క్రిస్ బకర్, సిమోన్ కీలింగ్, టిమ్ హంట్‌కు దక్కుతుంది. వీరు ఇంగ్లండ్‌లోని క్లిఫ్టాన్ తీగల వంతెన పైనుంచి బంగీజంప్ చేసి ప్రపంచానికి వినూత్నమైన సాహసక్రీడను పరిచయం చేశారు. అయితే తగిన అనుమతులు లేనికారణంగా మరుక్షణమే అక్కడి పోలీసులు వీరిని అరెస్టు చేశారు. ఆ తర్వాత అమెరికాలోని గోల్డెన్ గేట్, రాయల్ గోర్జ్ వంతెనలపై వీరు తమ 'దూకు'డును కొనసాగించారు. వీరి చివరి ప్రదర్శన అమెరికాకు చెందిన ఎబిసి టీవీ నెట్‌వర్క్ 'దట్స్ ఇన్‌క్రెడిబుల్' రియల్ షోలో ప్రసారమైంది.

– చలనంలో వుండే క్రేన్ల నుంచి, వేడి బెలూన్ల నుంచి బంగీజంప్ చేసే ప్రక్రియకు 1982లో నాంది పలికారు.

– ఈ సాహసక్రీడను సరుకుగా మార్చిన ఖ్యాతిని న్యూజిలాండ్‌కు చెందిన ఎజె హక్కెట్ సొంతం చేసుకున్నారు. బంగీజంపర్ కూడా అయిన హక్కెట్ ఈ క్రీడకు విశేషమైన ప్రాచుర్యం కల్పించారు. హక్కెట్ తన తొలి బంగీని 1986లో న్యూజిలాండ్‌లోని ఔక్‌ల్యాండ్‌లో ఉన్న గ్రీన్‌హీద్ బ్రిడ్జ్ వద్ద ప్రదర్శించారు. మానవ నిర్మితాల్లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఈఫిల్ టవర్ సహా పలు దేశాల్లోని ప్రముఖ కట్టడాలు, భవనాల నుంచి కూడా ఆయన బంగీజంప్ చేశారు. కొన్నేళ్ల తర్వాత బంగీజంప్‌లో తాను గడించిన అనుభవంతో న్యూజిలాండ్‌లోని క్వీన్స్‌టౌన్‌లో బంగీజంప్ ఔత్సాహికుల ముచ్చట తీర్చేందుకు 'కవారావ్ బ్రిడ్జ్ బంగీ' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ

వివిధ దేశాల్లో బంగీజంప్‌లను పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది.

సాగేతాడు..తోలు బెల్టులు

బంగీజంప్ కోసం ధృఢమైన సాగే తాడు (ఎలాస్టిక్ రోప్), శరీరం బ్యాలెన్స్ తప్పకుండా రక్షణగా ఉండేందుకు తోలు పట్టీలు (లెదర్ బెల్ట్స్) ఉపయోగిస్తారు. ఈ సాహసక్రీడలో ఎలాస్టిక్ తాడు ముఖ్యభూమిక పోషిస్తుంది. తాడు సాగే గుణాన్ని, పటిష్టతను బట్టే బంగీలో బౌన్స్ (పైకి కిందకు, కిందకు పైకి) ఉంటాయి. సాధారణంగా ఈ క్రీడలో చోటుచేసుకునే ప్రమాదాలు పట్టీలు తెగిపోవడం వల్ల, తాడు తెగిపోవడం మూలంగానే జరుగుతుంటాయి. అందువల్ల ఈ తాడును అత్యంత నాణ్యతా ప్రమాణాలుండే లేటెక్స్ (జిగుర్లు)తో తయారు చేస్తారు. ఈ క్రీడను నిర్వహించే సంస్థలు తాడు నాణ్యతకు విశేష ప్రాముఖ్యత ఇస్తాయి. ఇందుకోసం కొన్ని సంస్థలయితే స్వతహాగానే ప్రత్యేకమైన ఎలాస్టిక్ తాళ్లను తయారు చేయిస్తాయి.

అతి ఎత్తైన జంప్

ప్రపంచంలో అతి ఎత్తైన జంప్ చేసిన ఘనత కూడా హాక్కెట్‌కే దక్కుతుంది. 760 అడుగులు(233 మీటర్లు) ఎత్తున్న చైనాలోని మకావు టవర్ నుంచి 2005లో ఆయన చేసిన స్కై జంపే ఇప్పటి వరకూ ఉన్న రికార్డు. అయితే దీనిని బంగీ జంప్‌గా పరిగణించడంలో కొన్ని భిన్నాభిప్రాయాలున్నాయి. ఎందుకంటే ఇందులో ఆయన ఎలాస్టిక్ తాడు బదులు స్టీల్ వైరును ఉపయోగించాడు. 2006 డిసెంబర్ 17 నుంచి మకావు టవర్ బంగీ జంప్‌ను ప్రారంభించింది. ప్రపంచంలో అతి ఎత్తైన బంగీజంప్ టవర్ ఇదే.

వెండి, బుల్లి తెరలపై బంగీ భంగిమలు

జనాల్లో విశేషమైన ఆసక్తి వున్న ఈ బంగీజంప్ సినీజనాల దృష్టి కూడా పడింది. చాలా సినిమాలలో బంగీ భంగిమలున్నాయి. 1995లో వచ్చిన జేమ్స్‌బాండ్ చిత్రం 'గోల్డెన్ ఐ' నుంచి చిరంజీవి 'బావగారూ..బాగున్నారా' వరకు ఈ ప్రస్థానం కొనసాగుతోంది. దక్షిణ కొరియాకు చెందిన ఓ చిత్రం టైటిల్‌లో కూడా బంగీని చేర్చారు. 'బంగీ జంపింగ్ ఆఫ్ దైర్ ఓన్' పేరుతో నిర్మించిన ఆ చిత్రం 2001లో వచ్చింది. అయితే ఆ చిత్రంలో కొద్ది సేపు మాత్రమే బంగీ ప్రస్తవన ఉంటుంది. 1986లో బిబిసి ప్రసారం చేసిన వినోదాత్మక కార్యక్రమం 'ది లేట్, లేట్ బ్రేక్‌ఫాస్ట్ షో'లో కూడా బంగీ చోటు సంపాదించింది.

రివర్స్ బంగీ

దీన్నే కాటాపల్ట్‌గా వ్యవహరిస్తారు. మామూలుగా బంగీజంప్‌ను ఏదైనా నిర్మాణం పైనుంచి దూకడం ద్వారా ప్రారంభిస్తారు. ఈ బంగీలో మాత్రం నేల పైనుంచే ప్రారంభిస్తారు. క్రేన్ ద్వారా చేసే ఈ బంగీలో తాడుతో జంపర్‌ను గాల్లోకి తీసుకెళ్లి బౌన్స్ చేయిస్తారు.

ప్రపంచంలో బంగీకి చక్కని వేదికలు

బంగీజంప్‌కు వివిధ దేశాల్లో పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు ఉన్నాయి. అమెరికాలోని గోర్జ్ బ్రిడ్జి(1053 అడుగులు) బంగీజంప్‌కు బాగా ప్రసిద్ధి పొందింది. రాయల్ తర్వాత చైనాలోని మకావు టవర్ (760 అడుగులు), స్విట్జర్లాండ్‌లోని వర్జెస్కా డ్యామ్(720 అడుగులు), దక్షిణాఫ్రికాలోని బ్లోకొరన్స్ బ్రిడ్జ్ (708 అడుగులు), ఆస్ట్రియాలోని యూరోపబ్రూకే బ్రిడ్జీ ఆధునిక బంగీజంప్‌కు ప్రసిద్ధ వేదికలుగా పేరొందాయి.

భారత్‌లో బంగీ...

గోవా : గ్రావిటీ అడ్వెంచర్స్ అనే సంస్థ ఇక్కడ బంగీజంపర్ల కోసం శాశ్వత వేదికను ఏర్పాటు చేసింది. ఆసియాలోనే తొలి బంగీజంప్ క్లబ్‌గా ఈ సంస్థ పేరొందింది.

న్యూఢిల్లీ : వాండర్‌లస్ట్ ట్రావెల్స్ సంస్థ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రేన్ ద్వారా బంగీజంప్ చేసేందుకు ఏర్పాటు చేసింది. దీని ఎత్తు 130 అడుగులు.

బెంగళూరు : కంఠీరవ స్టేడియంలో ఓజోన్ అడ్వెంచర్ స్పోర్ట్స్ క్లబ్ సందర్భానుసారంగా 80 అడుగుల ఎత్తైన బంగీజంప్ నిర్వహిస్తోంది.

హైదరాబాద్ : ఎగ్జిబిషన్లు వంటి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఇక్కడి నెక్లెస్ రోడ్‌లో కొన్ని సంస్థలు బంగీజంప్ ఏర్పాట్లు చేస్తుంటాయి.

సురక్షితమేనా...

ఏమాత్రం సురక్షితం కాదు. ఇది ప్రమాదంతో కూడిన సాహస క్రీడ. సాధ్యమైనంత వరకూ రక్షిత పరికరాలనే వినియోగిస్తున్నా గాల్లో ప్రాణాలు గాల్లోనే పోయిన విషాద సంఘటనలున్నాయి. నిర్వాహకుల అజాగ్రత్త మూలాన పట్టీలు తెగిపోవడం వంటి సందర్భాల్లోనే ప్రమాదాలకు ఎక్కువగా జరిగాయి. జంపర్ బరువు, తాడు సాగే సామర్థ్యాన్ని సరిగా అంచనా వేయకపోవడం వల్ల తాడు తెగిపోయి ప్రమాదాలు జరుగుతాయి. ఈ జంప్ చేసే అవకాశం అందరికీ లేదు. కనీసం 14 సంవత్సరాలు పైబడినవారు మాత్రమే బంగీ జంప్ చేయాలి. 50 సంవత్సరాలు పైబడినవారికైతే డాక్టరు అనుమతి తప్పనిసరి. గుండెసంబంధ వ్యాధులున్నవారు, భయస్థులకు బంగీ నిషిద్ధం.

ముందస్తు జాగ్రత్తలు...

బంగీజంప్ చేయాల్సిన ఔత్సాహికులు కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సివుంటుంది.

○ మొదట దేహదారుఢ్యం బంగీజంప్‌కు అనుకూలిస్తుందో లేదో నిపుణులను అడిగి తెలుసుకోవాలి.

○ సాధారణంగా ఆపరేటర్లు వివిధ రేట్లతో భిన్న నాణ్యతా ప్రమాణాలుండే పరికరాలను సమకూరుస్తుంటారు. ధరలెక్కువైనా సౌకర్యంతో కూడిన పటిష్టమైన తాళ్లు, బెల్టులనే ఉపయోగించాలి. ఇలాంటి సందర్భాల్లో ప్రాణం విలువ మర్చిపోకూడదు. తాళ్లు, బెల్టులు నాణ్యమైనవా లేదా అన్న విషయాన్ని ఆపరేటర్లను ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకోవాలి.

○ సాధ్యమైన సురక్షిత ప్రదేశాల్లోనే బంగీజంప్ ముచ్చట తీర్చుకోవాలి. స్థానిక బంగీక్లబ్‌ల నేతృత్వంలోనే బంగీజంప్ చేయడం ఉత్తమం.

○ పరికరాల విషయంలో ఏదేని అనుమానం వచ్చినా, అసౌకర్యంగా అనిపించినా వెంటనే ఆపరేటర్లకు ఆ విషయం చెప్పాలి.

○ మీకు జంపింగ్ మీద అవగాహన లేకుంటే నిపుణుల సలహాలు తీసుకోవడానికి ఏమాత్రం సంకోచించొద్దు. జంపింగ్‌కి వెళ్లే ముందు సంబంధిత పుస్తకాలను చదవండి. మీకంటే ముందు బంగీజంప్ చేసిన మీ బంధువుల, స్నేహితుల నుంచి సలహాలు తీసుకోండి.

○ మరో ముఖ్య విషయం ఏమిటంటే జంపింగ్ చేసేందుకు ఒంటరిగా వెళ్లడం కంటే బంధువులతో కలిసి వెళ్లడం ఉత్తమం.

సాహసమైనా, సంబరమైనా సన్నిహితుల సమక్షంలో చేసుకుంటే ఆ క్షణాలు మరింతకాలం సజీవంగా ఉంటాయి.

★



కొత్త పుస్తకాలు

చిత్తూరు జిల్లా జనజీవన ప్రతిబింబాలు

చిత్తూరు జిల్లా యువ కథానిక రచయితలలో పలమనేరు బాలాజీ అనతికాలంలోనే విశిష్ట స్థాన మేర్పరచుకున్నారు. చిత్తూరు జిల్లా యాసలో తన నివాస ప్రాంత పరిసర ప్రజల వైవిధ్యభరిత జీవిత చిత్రాలు పాఠకులను ఆకట్టుకునేవిధంగా అందించగల్గుతున్నారు. "మాటలు లేని వేళ" కవితా సంకలనంతో మంచి కవిగా పరిచయమైన ఆయన ఈ కథా సంపుటి "గది లోపలి గోడ" ద్వారా ఉత్తమ కథా రచయితగా కూడా నిరూపించుకున్నారు.

ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో మానవుల మధ్య పరస్పర మైత్రి మానవ విలువలు ధ్వంసమౌతున్న కాలంలో మానవత్వమే పరమధ్యేయంగా పాఠకులను ఆలోచింపచేసే విధంగా బాలాజీ కథలు పరిమళిస్తున్నాయి. మంచి కథలకు చిరునామాగా మన వ్యక్తిగత జీవితాలను కూడా ఆయన కథలో ప్రభావితం చేస్తాయి. పలువురు స్త్రీవాద రచయిత్రులకన్నా ఈయన కథలు మహిళా పక్షపాతులుగా నిలిచాయి. పురుష అహంకారులకు సున్నితంగా వ్యంగ్యాస్త్రాలు సంధించడంలో ఈ రచయిత కథలు అసమానంగా ఉన్నాయి.



గది లోపలి గోడ
-పలమనేరు బాలాజీ,
పేజీలు : 150,
వెల : 60/-,
ప్రతులకు : కె.ఎన్. జయమ్మ,
6-219, గుడియాత్తం రోడ్,
పలమనేరు - 517408,
చిత్తూరు జిల్లా.

ఇవే కాక మనుషులు మనుషుల మధ్య, చివరకూ భార్యాభర్తల మధ్య ఎన్నో మానసిక గోడలు – పూర్తిగా కలసిపోలేని మనస్తత్వాలు – ఈయన కలంలో జీవం పోసుకున్నాయి. మనసులు విప్పి మాట్లాడుకొని ఐక్యత సాధించినపుడే మానవ జీవిత సాఫల్యత ఆవిర్భవిస్తుందని బాలాజీ కథలతో మనకొక మంచి ఆలోచన కలిగిస్తాడు. మన చుట్టూ ఎంతో నిరాశ చుట్టుముట్టి ఉన్న దానితోనే సన్నటి ఆశాకిరణం కూడా ఉందనే ఆశాభావం ఈ కథను చదివితే మనము గ్రహించగల్గుతాము.

"గది లోపలి గోడ" కథా సంపుటిలో రచయిత ఎంపిక చేసిన పంథొమ్మిది కథలు మనకు జీవన వైవిధ్యాన్ని చూపెడతాయి. వాటిలోనూ కొన్ని కథలు చదివేటప్పుడు పాఠకుడు ఆవేదన చెందుతాడు. ఆగ్రహం చెందుతాడు. ఆహ్లాదం అనుభవిస్తాడు. వ్యంగ్య బాణాలతో భుజాలు తడుముకొంటాడు. హాస్య వల్లరితో గట్టిగా నవ్వుతాడు. కొన్ని కథలైతే చదువుతున్నప్పుడు మనకంటి కన్నీరు తెరలుగా అడ్డుపడుతుంది.

"సంకోచం" కథ విద్యా సంస్థలలో కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగినులు సాధారణంగా ఎవరూ ఊహించని మూత్రవిసర్జన సమస్యతో అల్లాడి చివరకూ తమ ఆరోగ్యాన్నే క్షీణింపజేసుకునే పరిస్థితి తెలిసినపుడు మనమిప్పటికీ నాగరిక సమాజంలో ప్రవేశించలేదనిపిస్తుంది.

కాన్వెంట్లలో మన పిల్లలను చేర్చి వారికి మంచి విద్యను అందిస్తున్నామని మధ్యతరగతి వారందరూ మురిసి పోతున్నారు. అయితే మహిళలు ఇళ్ళల్లో గృహహింసను అనుభవిస్తున్నట్లు చిన్నారులు బడిహింసను అనుభవిస్తున్నారని ఎంతమంది తల్లిదండ్రులు గ్రహిస్తున్నారని రచయిత "బడికి వెళ్ళే దారి"లో పాఠకులను ప్రశ్నిస్తున్నారు.

రాయలసీమలోని ఇతర జిల్లాలలో వలే చిత్తూరు జిల్లాలో కూడా కరువు రక్కసి కరాళనృత్యం చేస్తుంటే బక్కచిక్కిన రైతులు నానా అవస్థలు పడి అప్పులు పుట్టించుకొని ఎంతో లోతుకు బోరులు తవ్వించి చుక్క గంగను చూడలేక ఆత్మహత్యలే శరణ్యమని తమ జీవితాలు ముగించుకొంటుంటే వారి కుటుంబాలు ఏమవుతాయి? స్వయంగా మండల అభివృద్ధి అధికారి అయిన బాలాజీ "రోడ్డు దాటిన వాడు" కథానికలో ప్రత్యక్షంగా వివరిస్తుంటే వ్యవసాయంలో మనము నిజంగానే అభివృద్ధి సాధించేశామా అనే సందేహము కలుగక మానదు.

మన భౌతిక పరిస్థితుల చిత్రణే గాక రచయిత సున్నిత హృదయుడు. కనుక సోదరి ప్రేమ, భార్య ప్రేమలలోని అంతరంగాలను మన మనసులు కరిగేటట్లు చిత్రీకరించారు. "ఆత్మీయులు" కథలో రచయిత చెల్లెలు అర్థాయుష్షుతో తల్లిదండ్రుల మొండి పట్టుదల కారణంగా తనువు చాలిస్తే ఆ చెల్లెలి స్మృతి ఎల్లెడలా రచయితను వేదనా భరితుణ్ణి చేస్తుంటే ఆ కథను చదువుతున్న మన కళ్ళు కన్నీరు కార్చకుండా ఉండలేవు.

చివరి కథ "గది లోపలి గోడ" పుస్తక శీర్షికగా కూడా ఉంది. నేటి పరుగుల ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ముఖ్యంగా ఉద్యోగాలు చేసే భార్యాభర్తలు తమ తమ పనుల వేగంతో ఒకే గదిలో కలసి జీవించినా కలసిపోయి తమ సున్నిత ప్రేమలను పంచుకోవడంలేదు. ఒకే మంచం మీద శయనించినా వారి మధ్య ఎంతెంతో దూరం. వివాహ పూర్వం వారి జీవితాలను శాసించిన ప్రేమభావాలు కవితావేశాలు ప్రకృతి వీక్షణాలు అన్నీ కరిగిపోయి యంత్రాలుగా మారిపోతున్నారు. కుటుంబ సభ్యులందరూ పక్క ఊరికి వెళ్ళిపోయిన సందర్భంలో అపూర్వంగా భార్యాభర్తలు తమ పెళ్ళి ప్రారంభరోజులను గుర్తుకు తెచ్చుకొని,

నీకు దగ్గరయ్యేటప్పుడు
పెదాలు ఎర్రబడతాయి
నీవు దూరమవుతుంటే
కళ్ళు ఎర్రబడుతాయి

అనే కవితను స్మరించుకొని సుదీర్ఘ కాలం తర్వాత ఆత్మీయంగా ఒక్కటయి ఆనందాల ఎల్లలు చూస్తారు.

ఇలా పలమనేరు బాలాజీ ఈ కథల సంపుటి "గది లోపలి గోడ" ఒక ఉత్తమ కథా సంకలనంగా మన హృదయాలను చూరగొంటుంది.

- ఎ.జి. యతిరాజులు



వేటికవే...

హైదరాబాదు ఆర్ట్ సొసైటీ ఇటీవల తాజ్‌కృష్ణాలో నిర్వహించిన గ్రూప్‌షోలోని కొన్ని చిత్రాలు ఇవి. వైవిధ్యం మూర్తీభవిస్తున్న ఈ చిత్రాలు నాణ్యతలోను, నైపుణ్యంలోను సీనియర్ చిత్రకారుల చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ఉన్నాయి. తగిన ప్రోత్సాహం, మార్కెట్ సంబంధాలు ఉండే ఎవరో అతి కొద్ది మందికి మాత్రమే దక్కుతున్న ఆకర్షణీయమైన ధరలు వీరికీ తప్పక లభిస్తాయని అనిపిస్తుంది. ఇలాంటి వారి చిత్రాలు చిత్రకళాభిమానులు, కలెక్టర్ల దృష్టిలో పడేలా చేయడం ద్వారా, అలాంటి అవకాశాల్ని కల్పించడానికి 68ఏళ్ల చరిత్ర కలిగిన హైదరాబాదు ఆర్ట్ సొసైటీ కృషి చేస్తున్నది. 1941లో మొదలైన ఈ సంస్థ చేయితిరిగిన చిత్రకారులకు, యువ చిత్రకారులకు ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. వార్షిక ప్రదర్శనలను నిర్వహించడం, అవార్డులను ప్రదానం చేయడం, గ్రూపు షోలు, సోలో షోలతో పాటు, చిత్ర, శిల్ప కళా క్యాంపులను సైతం నిర్వహిస్తూ చిత్రకళకు తనదైనరీతిలో సేవలందిస్తున్నది.

- జి.వి



అలీబాబా 40 దొంగలు

జరిగినకథ:

అలీబాబా దొంగల ముఠా గుహలోకి చొరబడి నగలు, బంగారు నాణేలు గోతాల్లో తెచ్చుకుంటాడు. తమ్ముడిలాగే సొత్తు తెచ్చుకుందామని వెళ్లిన అన్నను దొంగలు చంపేస్తారు. మొండేన్ని, తలను వేరువేరుగా గుహ ద్వారానికి వేళ్లాడదీస్తారు. ఎలాగో అతని శవాన్ని తీసుకొచ్చి చివరి కార్యక్రమాలు చేస్తాడు. అయితే తమ సొమ్మును కాజేసిన వాడు ఒకడుకాదు ఇద్దరని తెలుసుకుని రెండోవాడైన అలీబాబాకోసం వెతుకులాట మొదలెడతారు. అలా అతని జాడ తెలుసుకుంటుంది దొంగల ముఠా. ఏకంగా అలీబాబా ఇంటికి తన ముఠా సభ్యులతో సహా చేరతాడు. అయితే ఈ విషయాన్ని కనిపెట్టిన అలీబాబా భార్య వారిని హతమారుస్తుంది. ఇందుకు ప్రతీకారం తీర్చుకోవాలని వ్యాపారి రూపంలో వున్న దొంగల నాయకుడు పథకం వేస్తాడు. ఆ తర్వాత...

వ్యాపారి ఆహ్వానం మేరకు అతని ఇంటికి వెళతారు అలీబాబా, అతని భార్య, రక్తసంబంధీకులు, అనుచరులూ. పూటుగా ద్రాక్ష సారా తాగించి బిర్యానీలో విషం కలిపి అందరినీ ఒకేసారి చంపేయాలనుకుంటాడు. విందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేసేస్తాడు.

విందు ప్రారంభమౌతుంది. ద్రాక్షరసం వస్తుంది. అంతా తీసుకుంటారు. మిత్రులు, బంధువులు వుండడంతో అలీబాబా చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా వుంటాడు. చక్కగా నవ్వుతూ, నవ్విస్తూ అందరినీ హుషారైన వాతావరణంలోకి తీసుకొస్తాడు. ఒక క్షణంలో అయితే తనే దగ్గరుండి మరీ ద్రాక్ష సారా పోసేస్తుంటాడు. అలీబాబా కూడా మాటల మధ్యన మోతాదుకు మించి తాగేసి తూలుతుంటాడు. తన చుట్టూ ఏం జరుగుతోందో పరిశీలించే స్థితిలో వుండడు. అదేకదా దొంగల నాయకుడికి కావాల్సింది. పైగా తన లక్ష్యం నెరవేరబోతోంది. తనను, తన ముఠాను నాశనం చేసిన అలీబాబా మీద పగ తీర్చుకోబోయే సమయం ఆసన్నమైనందుకు అతనికి ఎంతో ఉత్కంఠగా వుంది. చూపులో తీక్షణత పెరుగుతుంది. అలీబాబాను తీక్షణంగా చూస్తూ పళ్లు నూరసాగాడు. అదే సమయంలో అతడిని అలీబాబా భార్య చూస్తుంది. అతని కళ్లు ఎక్కడో చూచినట్టనిపిస్తుంది. అయితే ఎక్కడనేది ఆవిడకు గుర్తురాదు వెంటనే. ఆలోచించగా ఆలోచించగా... తడుతుంది అతడే నూనె వ్యాపారని. అంటే 'దొంగల నాయకుడు' అనుకుంటుంది. తన భర్తకే కాకుండా అందరికీ ప్రమాదం పొంచి వుందని ఆమెకు తెలుస్తుంది. వెంటనే తను పూనుకోకపోతే వారంతా ప్రాణాలు కోల్పోవడం ఖాయమని అనుకుంటుంది. వెంటనే అందాల భామగా మారిపోతుంది. ఓ చేత్తో ద్రాక్షసారా తీసుకొని మరో చేత్తో కత్తి పుచ్చుకొని నృత్యం ప్రారంభిస్తుంది. అద్భుతమైన ఆమె నృత్యం చూసి అంతా సంతోషంతో చప్పట్లు చరుస్తారు. అరుపులు...కేకలు... వాతావరణం ఒక్కసారిగా ఉత్సాహపూరితంగా మారిపోతుంది.

తన పని పూర్తిచేయడానికి తగిన సమయం ఇదేనని దొంగల నాయకుడు లోలోన ఆనందపడిపోతుంటాడు. ద్రాక్షసారా తాగడం అయ్యాక ఇక బిర్యానీ వడ్డించడం మిగిలింది. అది వడ్డిస్తే... ఒకేసారి అంతా పరలోక ప్రయాణం కడతారని తెగ సంతోషపడిపోతుంటాడు.

ఈలోగా బేగం నాట్యం చేస్తూ వచ్చి దొంగల నాయకుడికి సారా పోయడానికి వంగుతుంది. అందరూ అదే అనుకుంటారు. అయితే అలా వంగినట్టు వంగుతూనే కత్తిని దొంగలనాయకుడి గుండెల్లో దించుతుంది. చెయ్యి వేసుకుంటారు.

అలీబాబా మాత్రం 'ఇతను దొంగల నాయకుడా! నేనస్సలు గుర్తించలేదే! ఎంత ప్రమాదం తప్పింది' అంటాడు. ఆమె నవ్వుతూ "ఎవ్వరూ ఇక్కడున్న పదార్థాలను తాకకండి. అవి పూర్తిగా విషపూరితమయ్యాయి' అంటుంది. అలీబాబా మాత్రం భార్యను మనస్ఫూర్తిగా అభినందిస్తాడు.

ఆ తర్వాత అలీబాబా ఆనందంగా జీవిస్తాడు. వ్యాపారంలో మరింత డబ్బు, పేరు సంపాదిస్తాడు. ఆ డబ్బుతో ఎంతోమంది పేదలకు సాయం చేస్తాడు. మసీదులు నిర్మిస్తాడు. వృద్ధులకోసం ఆశ్రమాలు కట్టిస్తాడు. ఎంతోమందికి జీవనోపాధిని కల్పించే విధంగా ఎన్నెన్నో ఆలోచనలను ఆచరణలో పెడతాడు.

వృద్ధాప్యంలో పిల్లలకు వ్యాపారం అప్పగించి భార్యతో సహా మక్కా వెళ్లిపోతాడు.

(అయిపోయింది)

పునఃకథనం: కె. చరిత